నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
# కరీంనగర్
పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల
సోమవారం 8 ఏప్రిల్ 2024 9 పేజీలు

# కోడ్‌తో కష్టాలు




- పెండ్లిళ్లు,శుభకార్యాల్లో నగదు చెల్లింపులకు ఇబ్బందులు
- రూ. 10 లక్షల బ్యాంకు లావాదేవీలపై ఆరా
- రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లొద్దు
- రిజిస్ట్రేషన్లు, వ్యాపారాలకు కోడ్ కష్టాలు



సూర్య కోనారావుపేట

ఎన్నికల కోడ్ వల్ల అనేక తిప్పలు తలెత్తుతున్నాయి. సుదీర్ఘకాల కోడ్ అమల్లో ఉండడం వల్ల పలు అభివృద్ధి పనులకు ఆటంకమే కాకుండా సంక్షేమ పథకాలకూ అడ్డు అవుతున్నది. ముఖ్యంగా ప్రజల వ్యక్తిగతమైన జీవితంపై కూడా కోడ్ ప్రభావం తీవ్రంగా పడుతుంది. వేసవిలో పెళ్లిళ్లు, శుభకార్యాల సీజన్ కావడంతో నగదు చెలామణికి కోడ్ ఆటంకంగా మారుతోంది. బ్యాంక్ లావాదేవీలపై కూడా ఆంక్షలు ఉండడంతో రిజిస్ట్రేషన్లు, వ్యాపారాలకు కూడా ఇబ్బందులేర్పడుతున్నాయి. రెండు నెలల పాటు పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉంటున్నందున పెళ్లిళ్లు, వైద్య ఖర్చులు, రిజిస్ట్రేషన్ల వంటి అత్యవసరాలకు సంబంధించి కూడా గట్టి నిఘా పెట్టడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ జారీ చేసింది మొదలు తెలంగాణ రాష్ట్రంలో పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ ముగిసే ముహుర్తాలతోనే పెళ్లిళ్లు జరిగాయి. ఈ నెల 25, 28, 29, నాటికి రెండు నెలల సమయమిచ్చారు. ఏప్రిల్ 18 నుంచి నామినేషన్ల స్వీకరణ షురూ కానుంది. జూన్ 4న దేశ వ్యాప్తంగా ఓట్ల లెక్కింపు జరగనుంది. ఆ మరుసటి రోజు నుంచి ఎన్నికల కోడ్ ముగియనుంది. ఇంత సుదీర్ఘ కాలం ఎన్నికల కోడ్ అమలు చేయడం వల్ల రాజకీయ నాయకులని కట్టడి చేయడం ఏమో కానీ..! సామాన్య ప్రజల్ని మాత్రం తిప్పలకు గురి చేస్తున్న పరిస్థితి ఉంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పలు చోట్ల చెక్ పోస్టులు పెట్టారు. అంత రాష్ట్రం,అంతర్ జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్టులు పెట్టారు. ప్రతి చోటా స్పెషల్ పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. నగదు, బంగారం, వెండి, ఇతర వస్తువుల్ని తరలిస్తే ఆధారాల్లేవని సీజ్ చేస్తున్నారు. 2 లో..

## ప్రజాపాలన కాదు... ప్రతీకార పాలన

- బీఆర్ఎస్ నాయకులు డా.ఆర్. ఎస్.ప్రవీణ్ కుమార్
- కేసీఆర్ నాయకత్వాన్ని ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారు
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్

సూర్య కరీంనగర్ ప్రతినిధి

రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాపాలన పేరుతో ప్రతీకార పాలన సాగిస్తున్నారని భారత రాష్ట్ర సమితి నాగర్ కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి డా.ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో భాగంగా ఆదివారం కరీంనగర్ లో ఏర్పాటు చేసిన పార్టీ సభకు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తుక్కుగూడ వేదికగా ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ అబద్ధపు హామీలు ఇచ్చి, ప్రజలను మోసం చేసిందన్నారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా గారడీల (మిగతా 2లో)





## ఎల్ఎండీలో నీరు లేక బయటపడ్డా పాత రోడ్డు

- కరీంనగర్ ఫోటో గ్రాఫర్



## ఓ బామ్మ 105 ఏళ్ళు.. నో షుగర్! నో బీపి!!

8 లో..

సూర్య కొడిమ్యాల



## అశ్రునయనాల మధ్య ముగ్గురి అంత్యక్రియలు

సూర్య హుజూరాబాద్ 6 లో..

# కోడ్‌తో కష్టాలు

**-ఏప్రిల్, మే నెలల్లో విపరీతంగా పెండ్లిళ్లు..**

వివాహ శుభముహూర్తాలకు మంచి రోజుల్లేక పోవడంతో మూడు నెళ్లుగా పెళ్లిళ్లు జరగలేదు. ఈ నెలలో 24 వరకు పెళ్లిళ్లున్నాయి. శుభ ముహూర్తాలు చూసు కుని పెళ్లిళ్లు ఖరారు చేసుకున్నరు. పెళ్లి కోసం పంక్షన్ హాళ్లు, బ్యాండ్ మేళం, డెకరేషన్, వంటలు, మటన్, చికెన్, బంగారం, వెండి, ఇతర పర్నీచర్, బట్టలు, రవాణా కోసం బస్సులు వీటన్నింటికీ వివాహం సందర్భగా ఖర్చు చేయాలి.వీటితో పాటు వదువరులకు కట్నకానుకల కింద నగదు కూడా చెల్లిస్తుంటారు. ఇదంతా సహాజంగా జరిగే కార్యక్రమం కానీ ! ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఏది సాఫీగా సాగని పరిస్థితులెదురవుతున్నాయి.ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రూ.50 వేల నగదు కంటే ఎక్కువ తీసు కెళ్ళితే తగిన పత్రాలు చూపించాలి. అవి ఎవరి నుంచి వచ్చాయి..? అట్టి డబ్బులు ఎవరిస్తున్నారు.ఎక్కడి నుండి వచ్చాయి, అనే ఆధారాలు చూపించాల్సి ఉంటుంది. పెళ్లి కోసం కూడబెట్టుకున్న సొమ్ముకు కూడా ఆధారాలు చూపడం సాధ్యం కాదు. కానీ..! డబ్బు తీసుకెళు ంటే పోలీసులు చెక్ పోస్ట్ ల వద్ద, ఇతర ప్రాంతాల్లో తనిఖీలు చేస్తూ పట్టుకుని సీజ్ చేస్తున్నారు.అసెంబ్లీ ఎన్నికల వేళ కూడా ఇవే ఇబ్బందులు తలెత్తాయి.ఈ సారి పెళ్లిళ్ల సీజన్లో ఎన్నికల కోడ్ రావడంతో ప్రతిదీ సమస్యగా మారుతోంది. పంక్షన్ హాల్స్ అడ్వాన్స్, బంగారం, వెండి, పర్నీచర్, బట్టల కొనుగోలు చేయడానికి ఆన్లైన్ పేమెంట్స్ తప్ప నగదు ఇచ్చే పరిస్థితి లేదు. చాలా మంది తల్లిదండ్రులకు స్మార్ట్ పోన్ లేకపోవడం, ఉన్నా ఆపరేట్ చేయడం రాకపోవడం, గూగుల్ పే,ఫోన్ పే లో చెల్లిస్తే రూ.10 లక్షలకు మించితే కూడా ఆ ఖాతాలపై నిఘా పెట్టి విచారణకు పిలవడం వల్ల సమస్యలు వస్తున్నాయని పలువురు తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

**-వ్యాపారాలకు,రిజిస్ట్రేషన్ లకు ఇబ్బందులు...**

ప్లాట్స్, భూముల కొనుగోలు విషయంలోనూ ఎన్నికల కోడ్ ప్రభావం పడుతోంది. ప్లాట్స్, భూమి కొనుగోలు చేసేవాళ్లు అమ్మేవాళ్లు ఇద్దరు కూడా లక్షల్లో నగదు తీసుకెళ్లాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ విలువ కంటే మార్కెట్ ధరలు అదికంగా ఉంటాయి. అదనంగా నిర్ణయించే ధరకు చెల్లించేడబ్బులకు ఎలాంటి ఆధారాలు చూపడం వీలుకాదు. దీంతోభూముల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మందగించిందని రియల్టర్లు పేర్కొంటున్నారు. అదే విధంగా పెట్రోల్ బంక్ లు, బట్టల దుకాణాలు, వైన్స్ , మోర్స్, బంగారం, హార్డ్వేర్, హెూటల్స్, బార్స్,కౌంటర్ సేల్స్ కు వచ్చిన డబ్బులను సంబంధిత ఓనర్స్ కాకుండా నమ్మకస్తులైన సూపర్వైజర్స్, ఉద్యోగులు చూస్తుంటారు. ఏరోజుకారోజు వచ్చిన డబ్బులను బ్యాంకులో వేయడం వీలుకాదు.కౌంటర్ లో డబ్బుల్ని రాత్రిపూట ఉంచడం కష్టం.దీంతో. దుకాణాలు మూసేసి డబ్బులను ఇంటికి తీసుకెళ్లే సమయంలోనూ తనిఖీల్లో పట్టుపడుతున్న పరిస్థితి ఉంది.

**- పంట దిగుబడి అమ్ముకునే రైతులకూ కూడా...**

యాసంగీ పంటల కోతలు మొదలయ్యాయి. మిల్లర్లు రైతులకు ధాన్యం డబ్బులు చెల్లిస్తున్నారు.రైతులు తమ అవసరాల కోసం రూ.50వేలకు మించి తీసుకెళ్లడం ఇబ్బందిగా మారింది. వరి కోతలు కూడా ప్రారంభమయ్యాయి. ఈ నెలలో ధాన్యం కొనుగోళ్లు జోరుగా సాగితే రైతు చేతికి డబ్బులొస్తాయి. ఇతర పంటలైనా, మామిడి, బత్తాయ, జామ వంటి తోటల్లో కాయ తెంపుతున్నారు. కౌలుదారులు, వ్యాపారులు రైతులకు డబ్బులు చెల్లించాలి. నగదు లావాదేవీల విషయంలోరూ.50 వేలకు మించితే పట్టుపడుతాయనే భయం రైతులను వెంటాడుతుంది. ఐకేపీ కేంద్రాల్లో విక్రయించిన ధాన్యానికి మాత్రమే బ్యాంకుల్లో డబ్బులు జమచేస్తారు. మిల్లర్లకు వ్యాపారులకు విక్రయించే సరుకుకు నగదుగానే చెల్లిస్తారు.

# బిజిగిరి షరీఫ్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు, పవిత్రదినం షబెఖద్ర్

**సూర్య, జమ్మికుంట రూరల్**

రంజాన్ మాసంలో అత్యంత పవిత్రమైన రోజు షబెఖద్ర్, మానవాళి శ్రేయస్సు కోసం అల్లాహ్ ఖురాన్ ను భువికి పంపిన పుణ్యదినంగా దీన్ని ముస్లింలు భావిస్తారు. మహమ్మద్ ప్రవక్త కృపను పొందడానికి నమాజ్( ప్రార్ధన), హజ్( మక్కా యాత్ర), జకాత్( దానధర్మాలు చేయడం) వంటి ఎన్నో మార్గాలున్నాయి. వీటన్నింటిలోకి ఉపవాస దీక్షలు ఎంతో ఉత్తమమైన మార్గంగా ముస్లింలు నమ్ముతారు. అందుకే రంజాన్ ఉపవాస దీక్షలు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. నెల రోజుల ఈ దీక్షలో చివరి పది రోజులు అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. జమ్మికుంట మండలం బిజిగిర్ షరీఫ్ గ్రామంలోని జామే మస్జిద్ లో పవిత్రదినం షబెఖద్ర్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.



**వేయి మాసాల పుణ్యఫలం....**

రంజాన్ నెల రోజుల ఉపవాస దీక్షలో చివరి పది రోజుల్లోని బేసి రాత్రులు 21, 23, 25, 27, 29 వ రోజుల్లో ఏదో ఓ రోజున ఖురాన్ ను అల్లాహ్ భువికి పంపాడని ముస్లింలు విశ్వాసిస్తారు. వీటన్నింటిలోను ఏదో ఒక రోజు రాత్రి షబెఖద్ర్ అని మహనీయులు స్పష్టం చేశారు. 27వ రోజున షబెఖద్ర్ కావడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయని భావిస్తారు. జామే మస్జిద్ మతగురువులు మౌలానా నౌమన్ హాష్మీ, మౌలానా యాసీన్ మాట్లాడుతూ అల్లాహ్ దూతలు మానవాళి కోర్కెలు తీర్చడానికి, నరక భయాన్ని తప్పించడానికి భూమి మీద సంచరిస్తారని, అల్లాహ్ ఆదేశం మేరకు మానవుల కోర్కెలు తీర్చడానికి వారు సంసిద్ధులై వస్తారని చెప్పారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఈ రోజున జాగరణ చేస్తూ తమ ఇహపరమైన ఇబ్బందులను తొలగించాలని అల్లాహ్ ను ప్రార్థిస్తారని చెప్పారు. షబెఖద్ర్ రోజున పవిత్ర ఉపవాస దీక్షతో జాగరణ చేస్తే వేయి నెలలు అంటే 83 ఏళ్ల 4 నెలల కాలంలో ఉత్తమ కర్మలతో పొందే పుణ్యఫలం దక్కుతుందని ముస్లింల నమ్మకమని మౌలానా యాసిన్ చెప్పారు. ప్రత్యకంగా 20 రకత్ తరావీ నమాజ్ నిర్వహించారు. ఆనంతరం మస్జిద్ సమీపంలో ఉన్న హజ్రత్ సయ్యద్ ఇంకుషావలి రహ్మతుల్లాహు అలై దర్గాలోని సమాధులకు దర్శనం చేసుకున్నారు. వర్షాలు కురువాలని, పాడి పంటలు బాగా పండాలని, రాష్ట్రం సుభీక్షంగా ఉండాలని ప్రార్థనలు చేశారు. మత గురువులను శాలువాతో సన్మానించారు. మిఠాయిలను పంచారు. మస్జిద్ కు విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మండల మాజీ కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ అంకుషావలి, జామే మస్జిద్, దర్గా కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ ఇక్బాల్, దర్గా కమిటీ ఉపాధ్యక్షుడు మొహమ్మద్ అబ్దుల్ కరీం, దర్గా కమిటీ కార్యనిర్వాహణ అధ్యక్షుడు మొహమ్మద్ తౌపిక్ హుస్సేన్, దర్గా కమిటీ కార్యదర్శి మహమ్మద్ జమాల్ అష్రఫ్, దర్గా కమిటీ కోశాధికారి మొహమ్మద్ మహమూద్, దర్గా కమిటీ సంయుక్త కార్యదర్శి మహమ్మద్ నయిముద్దీన్, సభ్యులు అహమ్మద్, లతీఫ్ హుస్సేన్, జలీల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల్లో ఆధ్యాత్మిక భావన అలవడడం చాలా మంచిది

**- కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ జువ్వాడి నరసింగరావు**

**సూర్య -కోరుట్ల**

సమాజంలో ఆధ్యాత్మిక భావన అలవడి తేనే భావి సమాజం క్రమశిక్షణతో ముందుకు పోతుందని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జువ్వాడి నరసింగరావు అన్నారు .ఆదివారం కోరుట్ల పట్టణంలో నీశ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ముందస్తు ఉగాది ఉత్సవాల్లో జువ్వాడి నరసింగరావు పాల్గొని ప్రసంగి ంచారు .ఈ సందర్భంగా సేవసమితి సభ్యులు చేస్తున్న కార్యక్రమాలను జువ్వాడి నరసిం గం ావు కొనియాడారు. సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులుజువ్వాడి కృష్ణారావు మాట్లాడు తూ సత్య సాయి సేవా సమితి సభ్యులు మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుమల గంగాధర్ మాట్లాడుతూ సత్యసాయి సేవా సమితి తరపున నిర్మించబోయే సాయి ఆలయానికి తన వంతుగా వ్యక్తిగత తోడ్పాటు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సత్య సాయి సేవాసమితి అధ్యక్షులు చిదురాల అశోక్, చిదురాల నారాయణ ,బార్ అసోసియేషన్ అధ్యక్షులు తన్నీరు శ్రీనివాస్ రావు ,కర్ణాకర్ రావు ,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొంతం రాజం, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెరు మాండ్ల సత్యనారాయణ, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏలేటి మహిపాల్ రెడ్డి ,ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ ప్రధాన కార్యదర్శి రాజోజి సదానంద చారి, కౌన్సిలర్ఎంబేరి నాగభూషణం, కౌన్సిలర్ సంగలింగం , కౌన్సిలర్ మోర్తాడ్ లక్ష్మీ నారాయణ , ఎంబేరి సత్యనారాయణ, చిట మెల్లి రంజిత్ గుప్త ,చిట్యాల లక్ష్మీనారాయణ, లక్కాకుల సద్గురు ,శంభోజి మధు ,తెడ్డు విజయ్ ,చిట్యా ల సందీప్ ,గౌనె సదానంద్, రామ్మోహన్ శ్రీనివాస్, రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.





## ప్రజాపాలన కాదు...ప్రతీకార పాలన

(మొదటి పేజి తరువాయి)

పాలన సాగిస్తున్నారని విమర్శించారు.కరీంనగర్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో భారాస నేతలపై పోలీసులపై అక్రమ కేసులు పెట్టి, భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. నాయకులు, కార్యకర్తలు అక్రమ కేసులకు భయపడకుండా దైర్యంగా ఎదుర్కొని దోపిడీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఓడించాలన్నారు.రాబోయే పార్లమెంటు ఎన్నికలు వంద రోజుల అబద్దాల కాంగ్రెస్ ప్రభుత్వం,పదేళ్ల నిజమైన పాలన అందించిన భారాసల మధ్య జరుగుతున్నాయన్నారు.రాష్ట్రం కరువు ఏర్పడి పంటలు ఎండిపోయి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేత పత్రాల ల పేరుతో గత ప్రభుత్వాన్ని బద్నాం చేసే కుట్రలు చేస్తుంది తప్ప, ప్రజల సమస్యలు పరిష్కరించడంలేదని విమర్శించారు.మళ్లీ కేంద్రంలో మూడోసారి భాజపా అధికారంలోకి వస్తే, రాజ్యాంగాన్ని రద్దు చేసి,మనుస్మృతి ఆధారంగా అలహాబాద్ లో కొంతమంది హిందుత్వవాదులు రాసిన హిందుత్వ రాజ్యాంగాన్ని అమలు చేస్తారని తెలిపారు. రాజ్యాంగం రద్దయితే హక్కులు కొలోతామని అన్నారు. రాజ్యాన్ని రక్షించుకునేందుకు పార్లమెంట్ ఎన్నికల్లో భారాసను గెలిపించాలన్నారు. జెండా మారినా అజెండా పేద ప్రజల పక్షమేనమి తెలిపారు. మసీదులు తవ్వే నాయకులు కావాలో, ప్రజా సమస్యలపై పార్లమెంటులో గళమెత్తే నాయకు లను గెలిపించాలో ఓటర్లు తేల్చుకోవాలన్నారు.కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో, సాధించిన తెలంగాణను 10 ఏళ్లు పాలించి అభివృద్ధిలో దేశంలో అగ్రగామిగా నిలిపిన భారాస అధినేత కేసీ ఆర్ నాయకత్వాన్ని ప్రజలు మళ్లీ కోరుకంటున్నారని కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. గత పదేళ్లు 24 గంటల విద్యుత్ ను అందించిన ఘనత కేసీఆర్ దేనని అన్నారు. ఆంధ్రా పాలనలో కరువుతో అల్లాడిన తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టులు కట్టి కోటి ఎకరాలకు సాగునీరు అందించిన పార్టీ భారాసదని అన్నారు. దేశంలో దళితుల ఆర్థిక అభివృద్ధి కోసం బ్యాంకుల్లో ఎలాంటి పూచీకత్తు లేకుండా దళిత బంధును ప్రవేశ పెట్టి దళితులకు రు.10 లక్షలు ఆర్థిక సాయం చేసిన ఘనత కేసీఆర్ దేనని అన్నారు. భారాసతోనే తెలంగాణ అభివృద్ధి జరుగుతది తప్ప, కాంగ్రెస్ పార్టీకి సాధ్యం కాదన్నారు.ఈ ఎన్నికల సన్నాహక సమావేశంలో కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్, సీనియర్ నాయకులు తుల ఉమ, గెల్లు శ్రీనివాస్ యాదవ్ పలువురు జడ్పిటిసిలు, ఎంపిటిసిలు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి ఇఫ్తార్ విందు

**సూర్య తిమ్మాపూర్**



మానకొండూర్ శాసన సభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఎల్ ఎం డి కాలనీలోని క్యాంప్ కార్యాలయంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చా రు. నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి ముస్లిం సోదరులు పెద్ద సంఖ్య లో హాజరయ్యారు.ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడు తూ సక్రమ మార్గంలో నడుచుకుంటూ, దేవుని యందు భక్తి విశ్వాసాలు కలవారికి వారి కర్మానుసారం మంచి జీవితం పొందగలుగుతారన్నారు.అల్లా అనుగ్రహం మీకు ఎల్లవేళలా ఉండాలని, మీరంతా జీవితాన్ని సుఖశాంతులతో ఆనందంగా గడపాలని కోరుకుంటూ ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజే శారు. అంతకు ముందు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఎమ్మెల్యే కి దీవెనలు అందజేశారు.

## కొండగట్టు అంజన్న ను దర్శించుకున్న కోరుట్ల జూనియర్ సివిల్ జడ్జి గుంటూరు పావని

**సూర్య మల్యాల**



ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి వారిని ఆదివారం కోరుట్ల జూనియర్ సివిల్ జడ్జి గుంటు పావని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ చిలుక శ్రీనివాస్ ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



తెలుగు దినపత్రిక సూర్య
www.suryaa.com

జగిత్యాల

సోమవారం 8 ఏప్రిల్ 2024



# లక్ష్మి నరసింహ స్వామి వారి కోనేరులో కప్పల కళేబరాలు

### - దెబ్బ తింటున్న భక్తుల మనోభావాలు - పట్టించుకోని ఆలయ అధికారులు

**సూర్య జగిత్యాల**

జగిత్యాల జిల్లా బీర్పూర్ మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్య క్షేత్రం శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానంలో సిబ్బంది నిర్లక్ష్యం భక్తుల పాలిట శాపంగా మారుతుంది. జిల్లాలోని నరసింహ క్షేత్రాల్లో ముఖ్యమైన ఈ దేవస్థానంలో స్వామి వారు కోరిన కోర్కెలు తీర్చుతారని భక్తుల విశ్వాసం కాగా ఆలయ సిబ్బంది ఇష్టా రాజ్యంగా విధులు నిర్వహించడం పట్ల భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంచార్జ్ ఆలయ ఈవో పర్యవేక్షణ లోపం కూడా తోడు కావడంతో ఇక్కడ పని చేసే సిబ్బంది ఆడిందే ఆట పాడిందే పాట అన్న చందంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. స్వామివారి జాతర బ్రహ్మోత్స వాలు ముగిసి నెల రోజులు కావస్తుంది. మళ్లీ



జాతర బ్రహ్మోత్సవాల వరకు ఆలయాన్ని పట్టించుకోవడం అవసరం లేదు అనుకుంటు న్నారేమో, ఈ నేపథ్యంలో భక్తులకు వసతులు కల్పించడం పూర్తిగా విస్మరించినట్టు ఉన్నారు. ఇందులో బాగంగా స్వామివారి కోనేరు లో నీరు మార్పుడం, లేదా శుద్ధి చేయకపోకడంతో కోనేరులో కప్పల కలేబరాలు తేలియాడుతు న్నాయి. కాగా ఆదివారం పలువురు హనుమాన్ దీక్షాపరులు కోనేట్లో స్నానం చేసి స్వామివారిని దర్శించుకోవడం కోసం వెళ్లారు. అయితే కోనేట్లో కప్పల కలేబరాల తేలియాడటమే కాకుండా ఆ పరిసర ప్రాంతం అంతా దుర్వాసన వేయడంతో భక్తులు స్నానాలు చేయకుండానే వెనుదిరిగారు. అయితే స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులు కోనేట్లో నుండి కనీసం నీళ్లు చల్లుకోవడం ఆనవాయితీ కాగా నీరు మురికిగా మారి దుర్వాసన వేస్తున్నా ఆలయ సిబ్బంది నీటిని మార్చకపోవడం భక్తుల మనోభా వాలు దెబ్బతినేలా ఉందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికా రులు స్పందించి స్వామివారి కోనేరు శుభ్రపరచడమే కాకుండా ఆలయంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టాలని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

## ఎమ్మెల్యేను పరామర్శించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి

**సూర్య జగిత్యాల**



జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ తండ్రి హనుమంత రావు ఇటీవల అనారోగ్యంతో మరణిం చగా వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదివారం పరామర్శించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు లో కలిసి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ఘనంగా మల్లన్న జాతర మహోత్సవం

**సూర్య ఇబ్రహీంపట్నం**



ఇబ్రహింపట్నం మండలం లోని ఎర్దండి గ్రామంలో ఆదివారం మల్లన్న జాతర మహోత్సవం ఘనంగా జరిగింది. మహిళలు బోనాలు సమర్పించి మల్లన్న స్వామి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఒగ్గు కళాకారుల బృందం చేసిన విన్యాసాలు అందరిని అలరించాయి.పూజారులు మల్లన్న స్వామికి పట్నాలు వేసి పూజలు చేశారు.స్వామి వారికి భక్తులు ప్రత్యేక మెక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు , మాజీ సర్పంచ్ కల్లెడ లక్షణ, ఎంపీటీసీ బసెట్టి రాధ,నాయకులు కల్లెడ గంగాధర్, అవుట్ల లక్ష్మణ్ ,దాసరి గంగనర్సయ్య, కున రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## బెదిరింపులకు గురి చేసి వివాహితపై అత్యాచారం

### - నిందితుని అరెస్ట్

**సూర్య జగిత్యాల**

జగిత్యాల పట్టణంలో నివసిస్తున్న ఓ వివాహితను బెదిరింపులకు గురి చేసి పలుమార్లు అత్యాచారం చేసిన టి ఆర్ నగర్ కు చెందిన కోటగిరి మోహన్ ను టౌన్ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. జనవరి నెలలో ఎగ్జిబిషన్లో పని చేస్తున్నప్పుడు ఆమెతో పరిచయం చేసుకుని ఆమెకు మాయమాటలు చెప్పి ఆమెతో సన్నిహితంగా ఉన్న ఫోటోలు మొబైల్ లో తీసుకున్నాడు. తర్వాత అతని కోరిక తీర్చమని అడిగినప్పుడు అతని మాట విననప్పుడల్లా అట్టి ఫోటోలను సోషల్ మీడియా లో పెడుతానని బెదిరిస్తూ ఆమెను బలవంతంగా అత్యాచారం చేశాడు. ఆమెను బెదిరిస్తూ తనకు అవసరం ఉన్నప్పుడల్లా బ్లాక్ మెయిల్ చేస్తూ ఆమెను బలవంతంగా అత్యాచారం చేస్తూ వచ్చాడని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు. ఇప్పటి వరకు నిందితునిపై జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్ లో 6 కేసులు, జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ లో 5 కేసులు, కోడిమ్యాల పోలీస్ స్టేషన్ లో ఒక కేసు మొత్తం 12 కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

## మాల సంఘం నూతన కమిటీ ఎన్నిక

**సూర్య ఎండపల్లి**



ఎండపల్లి మండల కేంద్రంలో మాల సంఘం కార్యవర్గన్ని ఆదివారం ఎన్నుకు న్నారు. అధ్యక్షులుగా గౌరి ప్రభాకర్ ఏకగ్రీవంగా ఎన్నిక కాగా ఉపాధ్యక్షులుగా దేవి నర్సయ్య (బాబు ), ప్రధాన కార్యదర్శి ఆల్క లచ్చయ్య, కార్యదర్శి అనే శ్రీనివాస్, కోశాధికారిగా అనే మల్లయ్య,కార్యవర్గ సభ్యులుగా దేవి చుక్కయ్య, దేవి భీమయ్య లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులు గౌరి ప్రభాకర్ మాట్లాడుతూ... మాల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక పట్ల కృషి చేసిన కుల బంధావులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మాల సంఘం అభివృద్ధికై తమ వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో దేవి భీమయ్య,కనకయ్య, మేసు భీమయ్య,అనే శంకరయ్య,దేవి చిన్నయ్య,దేవి ప్రవీణ్,దేవి విక్కీ,గౌరి చిరంజీవి,దేవి రవీందర్,మేసు ప్రదీప్,మనోజ్ కుమార్,దేవి మహేష్,దేవి చందు, దేవి వెంకటేష్, దేవి నగేష్,దగ్గుల చందు జూపాక నరేష్,పిట్ట స్వామి,దేవి పోచయ్య,దేవి అనిల్, ఆల్క ప్రశాంత్,దేవి చంద్రక్రాంత్ ఆల్క బాబు,ఆల్క పతి మహిళలు కుల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్నాం.. ఆదుకోండి

### - నా భర్తకు కిడ్నీ ఇచ్చి బ్రతికించుకుంటా

**సూర్య మల్లాపూర్**





భర్తలో సగభాగం భార్య.. కష్టం వచ్చిన కన్నీళ్ళు ఏరులై పారిన కడదాక కలిసి వుండే బంధం భార్య భర్తలదే అంటే వింటుంటాం అలాంటి అన్యోన్య దాంపత్యం పై విధి కన్నెర్ర చేసింది. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని ముత్యంపేట్ గ్రామానికి చెందిన సామల్ల తిరుపతి లావణ్య లది నిరుపేద కుటుంబం. తిరుపతి ఓ స్కూల్ బస్సు నడిపిస్తూ జీవనం సాగించేవాడు గత నాలుగు సంవత్సరాలుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చికిత్స కోసం ఆసుపత్రిల్లో ఇప్పటికే 7లక్షలకు పైగా ఖర్చు చేసుకున్నారు. ఇటీవల ఆసుపత్రి కి చికిత్స కోసమై వెళితే పరిస్థితి విషమించింది కిడ్ని మార్పిడి తప్పనిసరిగా చేయాలని వైద్యులు సూచించారు.అయితే భర్తను బ్రతికించుకోవడానికి లావణ్య తన కిడ్నీ ని ఇవ్వడానికి సిద్ధమయ్యింది. కాని.. కిడ్ని మార్పిడికి భార్య భర్త లు ఇద్దరికి ఆపరేషన్ చేయాల్సి వుండటంతో నాలుగు లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలపడంతో లావణ్య దీనంగా విలపిస్తూ దాతల సాయం కోరుతుంది. ఫోన్ పే, గూగుల్ పే నం. 8309424664 ద్వారాఆర్థికంగా తమను ఆదుకోండని వేడుకుంటుంది.

## పీపుల్స్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మోతె నరేష్

**సూర్య వెల్గటూర్**



పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా (డెమొక్రటిక్) జాతీయ అధ్యక్షులు హేమరాజ్ సింగ్ పటేల్ ఆదేశాల మేరకు జాతీయ కార్యదర్శి హరీష్ సహారే చంద్రాపూర్ పార్టీ ఆఫీసులో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పోతునూరి సత్యనారాయణ ఆధ్వర్య ంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మోతె నరేష్ ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయగా నియామకం పత్రాన్ని ఆదివారం మోతే నరేష్ అందజేశారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలను అప్పగించిన జాతీయ కార్యదర్శి హరీష్ సహారే మరియు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పోతునూరి సత్యనారాయణ కృతజ్ఞతలు తెలియజేశారు. తన వంతుగా పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు.

## ఘనంగా చాణక్య పాఠశాల వార్షికోత్సవం

**సూర్య గొల్లపల్లి**



జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండల కేంద్రంలో ఆదివారం చాణక్య పాఠశాల 13వ వార్షికోత్సవము ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృ తిక కార్యక్రమాలు, పాటలు, నృత్యాలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గొల్లపెల్ల మాజీ సర్పంచ్ నిషాంత్ రెడ్డి, కరస్పాండెంట్, అన్నెడి మనోహర్ రెడ్డి, ప్రిన్సిపాల్ వోల్లాల నారాయణ, ఉపాధ్యాయులు,విద్యార్థుల తల్లితండ్రులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

**సూర్య జగిత్యాల**



తెలంగాణ బయో సైన్స్ ఉపాధ్యాయుల ఫోరమ్ అధ్యక్షులు వీరబత్తిని రాజగోపాల్, ప్రధాన కార్యదర్శి తిరుపతి ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. జగిత్యాల జిల్లా విద్యా శాఖ అధికారి జగన్ మోహన్ రెడ్డి పాల్గొని ఆరోగ్యం ఆవశ్యకత గూర్చి ఉపాధ్యాయులకు తెలిపారు. ముఖ్యంగా ప్రస్తుత కాలంలో పని ఒత్తిడి, కలుషిత ఆహార పదార్థాలు, జంక్ ఫుడ్ వల్ల అనేక అనారోగ్య పరిస్థితులు ఏర్పడుతున్నాయి అన్నారు. వీటిని అధిగమించడానికి అందరూ సరైన ఆరోగ్య అలవాట్లు అలవర్చుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఫోరమ్ ఆధ్వర్యంలో సాత్విక ఆహారమైన వివిధ పండ్లను ఉపాధ్యాయులకు అందించారు. ఈ కార్యక్రమంలో బయో సైన్స్ ఉపాధ్యాయులు మచ్చ శంకర్, ప్రశాంతి, రాజేందర్, రాజన్న, నర్సయ్య, వసంత తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ లను గెలిపించుకోవాలి

### - బడుగు బలహీన వర్గాల ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మద్దతివ్వాలి..

### - తిమ్మపూర్ సహకార సంఘ చైర్మన్ బస శ్రావణ్..

**సూర్య ఇబ్రహీంపట్నం..**



పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ ల ను గెలిపించు కోవాలని, బడుగు బలహీన వర్గాల ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మద్దతివ్వాలని జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం లోని తిమ్మపూర్ సహకార సంఘ చైర్మన్ బస శ్రావణ్ పేర్కొన్నారు. ఆదివారం మండలం లోని తిమ్మపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమా వేశంలో ఆయన మాట్లాడుతూ భారతదేశం లో కాంగ్రెస్ ఎంపీ లు గెలిచి అధికారం చేజికుంటారన్నారు. పేదల పార్టీగా అణగారిన బహుజన వర్గాలకు అండగా నిలిచే పార్టీగా కాంగ్రెస్ కు ఇప్పుడు తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఆదరణ పెరిగిందన్నారు. మోడీ దేశానికి ప్రమాదమని నిరుద్యోగులు మోడీ ప్రభుత్వం పైన రగిలి పోతున్నారని ప్రతిపక్ష కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు.బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో ఉనికి కోల్పోయిందన్నారు. వంద రోజుల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు పట్ల ప్రజలు ఆకర్షితులైనారని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాహుల్ గాంధీ ని ప్రధాన మంత్రి చేయడం కోసం నిజామాబాద్ ఎంపి అభ్యర్థి తాటిపర్తి జీవన్ రెడ్డి ని గెలిపించుకుంటామని,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు ల సహకారం తో గ్రామాలను అభివృద్ధి చేసుకుంటామన్నారు. కార్యకర్తలు పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తె గుర్తింపుతోపాటు పదవులు వస్తాయని శ్రావణ్ పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు సిలివేరి దేవయ్య, చిట్యాల భుమరెడ్డి,జోగిరాం భుమేష్,బోడ రాజు,కమ్మరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగాన్ని గౌరవించే పార్టీలకే ఓటేయ్యాలి

**- మానవ హక్కుల వేదిక విస్తృత ప్రచారం**

**సూర్య పెద్దపల్లి**

రానున్న పార్లమెంట్ ఎన్నికలో ప్రజలనూ, ప్రజస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని గౌరవించే పార్టీకే ఓటు వేద్దామని మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముక్క ఐలయ్య ప్రజలకు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగానే సుల్తానాబాద్, పెద్దపల్లి పట్టణాల్లో మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం విస్తృత ప్రచారం చేస్తూ కరప త్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ దేశంలో రోజు రోజుకూ విద్వేష రాజకీయాలు పెరిగిపోతున్నాయని, రాజ్యాంగం, ప్రజల హక్కులపై పాలకులకు కనీస



గౌరవం లేని పరిపాలన కేంద్రంలో కొనసాగుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. నిరుద్యోగం, పేదరికం, దేశ ఆర్థిక స్థితి గతులు రోజు రోజుకూ దిగజారిపోతున్నాయని, దేశంలో ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీలు లేకుండా చేయడం, మత విద్వేషాలు రెచ్చగొట్టడం, హక్కుల గురించి మాట్లాడే వారి గొంతు నొక్కడం నేడు కేంద్ర పాలకులు అవలంభిస్తున్నారని అన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ప్రజల మధ్య అనేక రకాల విద్వేషాలను సృష్టించే రాజకీయ పార్టీలను ప్రజలు ఆదరించకూడదని విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగాన్ని, ప్రజలను గౌరవించే పార్టీలను గెలిపించాలని కోరారు. ఒక వేల అటువంటి పార్టీల అభ్యర్థులు బరిలో లేకపోతే నోటాకైనా ఓటు వేయాలి తప్ప, పొరపాటున కూడా ప్రజల మధ్య విద్వేషాలను సృష్టించే పార్టీలను పాలకులుగా ఎన్నుకోకూడదని కోరుతూ ప్రచార నిర్వహించారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ సభ్యులు ఎస్ అచ్యుత్ కుమార్, ఎం కిరణ్, సదానందం కొత్తూరు కుమార్ పాల్గొన్నారు.

## తనిఖీలు నిర్వహించిన జిల్లా పంచాయతీ అధికారి

**సూర్య ఓదెల**

ఓదెల మండలంలోని ఓదెల గ్రామపంచాయతీ ని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత గురువారం రోజు పల్లె ప్రగతి కి సంబంధించిన పనులు సెరిగ్రేషన్ షెడ్ పని విధానం, స్మశాన వాటిక ,రోడ్లు, కాలువలు పరిశీలించిన అనంతరం గ్రామపంచాయతీ కి సంబంధించిన రికార్డులను , అంగన్వాడీ, ప్రాథమిక పాఠశాలలో తనిఖీలు నిర్వహించారు. వివిధ పనులకు సంబంధించి అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. త్రాగునీటి సమస్య గురించి ప్రజలను అడిగి తెలుసుకున్న ఆమె వెంట మండల పంచాయతీ అధికారి కాటం భాస్కర్ , కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి తదితరులు ఉన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**సూర్య, సెంటినరీ కాలనీ**



కమాన్ పూర్ మండలంలోని సిద్దిపల్లి, పెంచికల్ పేట్, రొంపికుంట గ్రామాల్లో పి. ఏ.సీ.ఎస్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం సంఘం కార్యదర్శి తిమ్మరాజు సంతోష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోవద్దని కోరారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర ను రైతులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పుట్ట మధుకర్ కు రాజకీయ జీవితం కాంగ్రెస్ పార్టీ పెట్టిన బిక్షే

**సూర్య మంథని**



పుట్ట మధుకర్ అనే వ్యక్తి కి రాజకీయ జీవితం కాంగ్రెస్ పార్టీ పెట్టిన బిక్ష అని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఆదివా రం మంథని ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు దోపిడీ.. హత్య రాజకీయాలు చేసింది ఎవరో ప్రజలకు తెలుసన్నారు. కాంగ్రెస్ పార్టీ లేకపోతే పుట్ట మధు అనే వ్యక్తి ఎవరో కూడా ఎవరికి తెలియకపోవన్నారు. తనకు తాను ఏదో గొప్ప నాయకునిగా ఊహించు కోవడం తగదన్నారు. రైతులకు ఎలా సాగు నీరు ఇవ్వాలో తమ నాయకునికి పూర్తిస్థాయిలో అవగాహన ఉందన్నారు. ఈ ప్రాంతంలో నీళ్ల వల్ల పంటలు మునిగితే ఎందుకు స్పందించలేదన్నారు. తాము సమన్వయం పాటిస్తున్నామని ఇష్టం వచ్చినట్లు ఆరోపణలు చేయడం తగదన్నారు. తమపై అనవసర ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. మరోసారి ఇలాంటి చవకబారు ఆరోపణలు చేస్తే తగిన స్థాయి లో బుద్ధి చెప్తామన్నారు. అధికారంలో ఉన్నప్పుడు రైతులు గుర్తు రాలేదా అని ప్రశ్నిం చారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో ఇక్కడి రైతుల భూములను లాక్కొని నీటిని ఇతర ప్రాంతాలకు తరలిస్తే పుట్ట మధు ఎందుకు అడ్డుకోలేక పోయారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై మాట్లాడే హక్కు ఎవరికీ లేదన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆయిలి ప్రసాద్, పట్టణ అధ్యక్షులు పోలు శివ, నాయకులు శ్రీరాంబాట్ల శ్రీనివాస్, మల్హార్ మండల ఎం పి పి చింతలపల్లి మల్హార్ రావ్, ఐ ఎన్ టి యు సి నాయకులు పెరవేన లింగయ్య, మంథని సత్యం, ఎరుకల ప్రవీణ్,గోటికార్ కిషన్ జి, ఐలి శ్రీనివాస్, పెంటరీ రాజు, గుండా పాపారావు, రమేష్, లైశెట్టి రాజు, జగదీష్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

## సింగరేణిలో అంబేద్కర్ జయంతి వేడుకలకు రూ.12.10 లక్షల నిధులు కేటాయింపు

**సూర్య, సెంటినరీ కాలనీ**

సింగరేణి సంస్థలో అంబేద్కర్ జయంతి వేడుకలకు రూ.12.10 లక్షల నిధులను కేటాయిస్తూ సీఅండ్ ఎండీ నునావత్ బలరాం నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 14వ తేదీన సింగరేణి వ్యాప్తంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 133 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఆయన సూచించారు. ఈ మేరకు సోమవారం కొత్తగూడెంలో జీఎం (పర్సనల్) ఆధ్వర్యంలో ఎస్టీ అసోసియేషన్ ప్రెసిడెంట్, ఎన్విరాన్మెంట్ డీజీఎం ఏ. భాస్కర్ రావు, సింగరేణి ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఫారెస్ట్ డీజీఎం భానోత్ కర్ణ నాయక్, సింగరేణి కాలరీస్ ఎస్సీ,ఎస్టీ ఉద్యోగస్తుల యూనియన్ జనరల్ సెక్రటరీ అంతోటి నాగేశ్వరరావు, సింగరేణి ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు యాట ఓదెలతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నారు. కొత్తగూడెం కార్పొరేట్ ఆఫీస్, కొత్తగూడెం ఎల్లందు, మణుగూరు, ఆర్జీ-1,2,3 ఏరియా, భూపాల పల్లి, బెల్లంపల్లి, మందమర్రి, శీరాంపూర్ ఏరియాలకు రూ. ఒక లక్ష చొప్పున, జైపూర్ ఎస్టీపిపి పవర్ ప్లాంట్ కు రూ.50 వేలు, హైదరాబాద్ ఆఫీస్ కు రూ.35వేలు, ఒడిశా లోని నైని ఏరియా కు రూ.25 వేల నిధులను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

## పెద్దపల్లి గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తాం

**సూర్య ఓదెల**



ఓదెల మండలం కొలనూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండేటి ఐలయ్య యాదవ్ మాట్లాడుతూ నిన్న జరిగిన తుక్కుగూడ బహిరంగ సభలో కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ ఐదు న్యాయాలు ప్రకటించి దేశంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు కాబోతోంది చెప్పడం పట్ల కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఐదు న్యాయాలు ఆర్థిక సామాజిక అభివృద్ధిని సాధించేందుకు, ఉద్యోగ ,ఉపాధి అవకాశాలను బలోపేతం చేసేందుకు రైతులను, మహిళలను, యువతను ప్రోత్సహించి వారి నైపుణ్యాలను మెరుగులు దిద్ది భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి కి తోడ్పడతాయని అన్నారు. విజయ రమణారావు నాయకత్వంలో పెద్దపెల్లి గడ్డపై మరోసారి కాంగ్రెస్ జెండా ఎగరవేసి గడ్డం వంశి కృష్ణ ను భారీ మెజార్టీతో గెలిపిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఢిల్లీ శంకర్, మాజీ ఎంపీటీసీ చొప్పరి రాజయ్య ,గాజుల శివశంకర్, కాసారపు శ్రీనివాస్, మోహన్ రెడ్డి పవన్ కుమార్ బండారు చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ కి ఉగాది పురస్కారం అవార్డు అందుచేత

**సూర్య, సెంటినరీ కాలనీ**



రామగిరి మండలం నాగేపల్లి గ్రామ మాజీ సర్పంచ్ కొండవేన ఓదెలు యాదవ్ ఉగాది పురస్కారం-2024 అవార్డు అందుకున్నారు. నాగేపల్లి గ్రామాన్ని అభివృద్ధి పరంగా అన్ని రకాలుగా తీర్చిదిద్దినందుకు గతంలో ఆయనకు పలు అవార్డులు వచ్చాయి. ఈ క్రమంలో ఉత్తమ సర్పంచ్ గా ఓదెలు యాదవ్ కు ఈ అవార్డు ఇవ్వడం జరిగిందని దేవా కళాబృందం కార్యనిర్వాహకులు తెలిపారు. అదే విధంగా బేగంపేట గ్రామ మాజీ సర్పంచ్, కళాకారుడు కోంద్ర వెంకన్న గౌడ్ కళా కీర్తి అవార్డు అందుకున్నారు. కోంద్ర వెంకన్న గౌడ్ కి పలువురు ప్రజా ప్రతినిధులు, తోటి కళాకారులు బేగంపేట గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## గౌడ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు.

**సూర్య ఓదెల**



ఓదెల మండలం పోత్కపల్లి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఉగాది పండుగను పురస్కరించుకొని పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. డప్పు చప్పుడులతో శివశక్తుల పూనకాలతో అంగరంగ వైభవంగా పోచమ్మ బోనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు ,కులస్తులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి 25 కిలోల బియ్యం అందజేత

**సూర్య, సెంటినరీ కాలనీ**



కమాన్పూర్ మండల కేంద్రానికి చెందిన ఆరేల్లి మల్లేష్ ఇటీవల మరణించగా వారిని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు పరామర్శించి 25 కిలోల బియ్యాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాన వికాస వేదిక కళా మండలి అధ్యక్షుడు దాసరి రామస్వామి, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం కమాన్పూర్ మండల అధ్యక్షులు అంబటి కనకయ్య, గౌరవ అధ్యక్షులు మల్లేష్, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం కార్యదర్శి దాసరి రామ్ చందర్, బిట్ బిట్ డాన్స్ మాస్టర్ పులిపాక దేవ, మాజీ వార్డ్ మెంబర్ జంగాపల్లి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## మంథని మండలం కన్నాలలో వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఐటీ మంత్రి శ్రీధర్ బాబు

**సూర్య మంథని**



మంథని మండలం కన్నాల గ్రా మంలోని శ్రీ వెంకటేశ్వర స్వామిని ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆదివారం దర్శించు కున్నారు. యావత్ తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో, అష్టైశ్వర్యాలతో, ఉండాలని మంత్రి దుద్దిళ్ల శ్రీదర్ బాబు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఐలి ప్రసాద్, కిసాన్ సెల్ జిల్లా నాయకులు ముసుకుల సురేందర్ రెడ్డి, మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పెంద్రు రమాదేవి, మాజీ జెడ్పిటిసి సభ్యురాలు మూల సరోజన పురుషోత్తం రెడ్డి, పెయిల రాజయ్య , లచ్చయ్య గౌడ్, నాయకులు, ప్రజా ప్రతి నిధులు తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా పట్టాభిషేక మహోత్సవం

**సూర్య, జమ్మికుంట రూరల్**

జమ్మికుంట మండలంలోని జగ్గయ్యపల్లి గ్రామంలో గత నాలుగు రోజుల నుండి వేస్తున్న రామాయణ మహాకావ్యం ఘట్టం పట్టిభిషేక మహో త్సవంతో ముగిసింది. ఈ రామాయణ మహాకావ్యాన్ని చూడడానికి గ్రామ ప్రజలే కాకుండా చుట్టుపక్కల మండలాల నుండి అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. 20 సంవత్స రాల క్రితం నిర్వహించిన రామాయణం మరల జగ్గయ్యపల్లిలో నిర్వహించడం అనుభూతి కలిగించిందని అన్నారు. అన్నదమ్ములు, తండ్రి కొడుకుల మధ్య ఉన్న సంబంధాలను కళ్ళకు కట్టినట్లు కళాకారులు చూపించారు. ఈ సందర్భంగా బుధవారం ప్రారంభమైన రామాయణ కార్యక్రమం



శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా కొనసాగింది. పట్టాభిషేక మహోత్సవ అనంతరం కాకతీయ విద్యాసంస్థల అధినేత అవిరినేని సుధాకర్ రావు మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పట్టాభిషేకంలో పాల్గొనే భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. ఆద్యంతం పట్టాభిషేక మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. వచ్చిన భక్తులు పట్టాభిషేకం మీద కూర్చున్న శ్రీ సీతారామచంద్ర ఆంజనేయ స్వాములు ఒడు బియ్యం పోసి మొక్కులు అప్పజెప్పుకున్నరు. అనంతరం రామాయణానికి సహకరించిన వారికి శాలువాతో సన్మానం చేశారు. రామాయణ కళాకారులు వేసిన పాత్రలు ప్రజలను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమములో రామాయణ గురువు బోళ్ల కొమురయ్య, సహాయకులు పడాల సత్యనారాయణ, రామాయణ కళాకారులు, వివిధ గ్రామల నుండి వచ్చిన కళాకారులు హుస్సేన్, బిక్షపతి, సీత, మల్లన్న, మోహన్ రెడ్డి, రాజు, జమ్మికుంట, జగ్గయ్యపల్లి సాంస్కృతిక సమైక్య అధ్యక్ష, ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.

## రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా పోచమ్మ బోనాలు

**సైదాపూర్ / కరీంనగర్ ప్రతినిధి**



చల్లంగా చూడు పోచమ్మ తల్లో అంటూ కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం లాస్మన్న పల్లెలో శ్రీరామ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ తల్లికి పెద్ద ఎత్తున ఆదివారం బోనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గడప నుండి మహిళలు బోనం ఎత్తుకొని దప్పు చప్పులు శివసత్తుల నృత్యాల మధ్య గ్రామంలోని పోచమ్మ తల్లి ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని పాడిపంటలు బాగుండాలని వర్షాలు సమృద్ధిగా కురవాలని అమ్మవారిని వేడుకున్నారు. చిన్న పెద్ద తేడా లేకుండా మండుటెండను సైతం లెక్కచేయకుండా పోచమ్మ బోనాల్లో పాల్గొన్నారు .భవిష్యత్తులో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో మరింత ఘనంగా పోచమ్మ తల్లి బోనాలు నిర్వహిస్తామని రెడ్డి సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం అధ్యక్షులు కొట్టే వెంకటరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ దోనపాటి రామ్ రెడ్డి,మ్యాకల రవీందర్ రెడ్డి, కొంపల్లి రాజిరెడ్డి, జాల మహేందర్ రెడ్డి,మాజీఉపసర్పంచ్ మ్యకల మల్లారెడ్డి, జాల సంపత్ రెడ్డి, పాల్సాని రాంరెడ్డి, గుర్రాల మాధవరెడ్డి, బండ సంపత్ రెడ్డి, మ్యకల రాజిరెడ్డి,కొట్టే రాఘవరెడ్డి,భాస్కర్ రెడ్డి,కొంపల్లి సమిరెడ్డి,గుర్రాల మహేందర్ రెడ్డి, యూత్ నాయకులు కొట్టే రాజిరెడ్డి,దోనపాటి రాకేష్ రెడ్డి, బండ తిరుపతి రెడ్డి, మహిళలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కాషాయతీర్థం పుచ్చుకున్న బిఆర్ఎస్ , యువజన సంఘాల నాయకులు

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



శంకరపట్నం మండలానికి చెందిన పలువురు బిఆర్ఎస్ నాయకులు, కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ ఖాజాపాష, యువజన సంఘాల నాయకులు ఆదివారం భారతీయ జనతా పార్టీలో చేరారు. బిజేపి జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ వారందరికీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బిజెపిలో చేరిన వారిలో ఖాజాపాష, తెలంగాణ ఉద్యమకారుడు రాసమల్ల శ్రీనివాస్, అర్కండ్ల, కేశవపట్నం మాజి ఉప సర్పంచులు చెర్ల శ్రీనివాస్, బొంగోని కుమార్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కనుకుంట్ల శ్రీనివాస్, యువజన నాయకులు, పంజాల అనీల్ గౌడ్, కునారపు శ్రీనాథ్, బైరి రాజు, బొంతల రవి, మెడిశెట్టి రాజేష్, గుర్రం పవన్, రాసమల్ల సుధాకర్, రాసమల్ల రాజు, జూపల్లి రమేష్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు, ఎంపిటీసి ఎనుగుల అనీల్, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దండు కొమురయ్య, సీనియర్ నాయకులు దొంగల రాములు, మండల ప్రధాన కార్యదర్శి కొయ్యడ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముత్యాల పోచమ్మ తల్లి బోనాలు

**సూర్య మల్యాల**



మండల కేంద్రం కొత్తపేట లో నూతనంగా నిర్మించిన ముత్యాల పోచమ్మ తల్లి ఆలయంలో ఆదివారం వందలాదిగా మహిళలు పోచమ్మ తల్లి కి బోనాలతో డప్పు చప్పులతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. అనంతరంఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు ఈ సందర్భంగా మహిళలు అమ్మవారిని కుటుంబ సభ్యులను చల్లగా చూడాలని పాడు పంటలు పండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లాల జనార్దన్ రెడ్డి సర్పంచ్ తాజామాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షులు మిట్టపల్లి సుదర్శన్ మాజీ ఉప సర్పంచ్ పోతరాజు శ్రీనివాస్ మహిళలు ఆలయ కమిటీసభ్యులు తదితరులు పాల్గొన్నారు

## అశ్రునయనాల మధ్య ముగ్గురి అంత్యక్రియలు



**సూర్య, హుజురాబాద్**

ఇటీవల ప్రమాదంలో టిప్పర్ బోల్తాపడి మట్టి పడిన సంఘటనలో మృతి చెందిన ముగ్గురి అంత్యక్రియలు ఆదివారం కుటుంబ సభ్యులు, గ్రామస్తుల అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు జరిగాయి. శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ఈ సంఘటనలో బోర్నపల్లి గ్రామానికి చెందిన గంట విజయ్, గంట వర్ష, (అన్నా చెల్లెలు) గంట సింధుజ లు మృతి చెందిన విషయం విధితమే. ఆదివారం హుజురాబాద్ ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం అయిన పిదప ఆదివారం వారి అంత్యక్రియలు జరిగాయి. ఒకేరోజు గ్రామానికి చెందిన ముగ్గురు పిల్లలు మృతి చెందడం గ్రామంలో తీవ్ర విషాదం నింపింది. కాగా ముగ్గురి అంత్యక్రియలు గ్రామం శివారులో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు బాధాతప్త హృదయాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

**వీరస్వామి కుటుంబానికి తీవ్ర లోటు....**

ప్రమాదంలో మృతి చెందిన గంట విజయ్, గంట వర్ష లు స్వయానా అన్నా చెల్లెలు కావడం. వీరస్వామి కుటుంబంలో ఉన్న ఇద్దరు పిల్లలు మృతి చెందడంతో వారి కడుపు కోతకు ఎవరు తీర్చరాని విధంగా తయారైంది. వీరస్వామి దంపతులు కూలీ చేసుకుని జీవించే కడు బీదవారు. సింధుజ తండ్రి కొన్నాళ్ల క్రితం ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు. దాంతో అపురూపంగా ఆమెను పెంచుతున్నారు. మృతి చెందిన పిల్లల మధుర స్మృతులు గుర్తుతెచ్చుకొని కుటుంబ సభ్యులు గ్రామస్తులు దుఃఖ సాగరంలో మునిగారు.

## ఈనెల 14న పటేల్ యూత్ ఫోర్స్ ప్రథమ వార్షికోత్సవ జయప్రదం చేద్దాం

**- తెలంగాణ మున్నూరు కాపు జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షులు కొత్త లక్ష్మణ్ పటేల్**



**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

ఈనెల 14న కరీంనగర్ లో నిర్వహించే పటేల్ యూత్ ఫోర్స్ ప్రథమ వార్షికోత్సవ సభను జయప్రదం చేయాలని తెలంగాణ మున్నూరు కాపు జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు కొత్త లక్ష్మణ్ పటేల్ పిలుపునిచ్చారు. ఆదివారం కరీంనగర్ శివారులోని మున్నూరు కాపు హాస్టల్ వసతి గృహంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ యువత దేశానికి పట్టుకొమ్మలని యువకులు ఐక్యంగా ఉంటే దేనినైనా సాధించవచ్చు అన్నారు. అనతి కాలంలోనే 119 నియోజకవర్గాల్లో లక్షమంది సోషల్ మీడియా వేదికగా పటేల్ యూత్ ఫోర్స్ వేదికగా ఐక్యమవడం అభినందనీయమన్నారు. యువత సామాజిక కార్యక్రమాలు తోపాటు ప్రజలకు సమాజానికి ఉపయోగపడే మంచి కార్యక్రమాలను చేయాలని సూచించారు. పటేల్ యూత్ ఫోర్సు కు తెలంగాణ మున్నూరు కాపు జర్నలిస్టు ఫోరం అన్ని విధాలుగా సహాయ సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. అనంతరం యూత్ ఫోర్స్ సంబంధించిన పోస్టర్ను మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షులు బొమ్మ రాధాకృష్ణ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వేల్పుల శ్రీనివాస్ పటేల్ సూదుల వెంకటరమణ పటేల్, కార్యవర్గ సభ్యులు చల్ల కృష్ణ,యూత్ ఫోర్స్ నాయకులు అభిషేక్, సాయిచరణ్, అనుదీప్, మనోహర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద ముస్లిం మహిళలకు దుస్తుల పంపిణీ

**సూర్య, హుజురాబాద్**



రంజాన్ పండుగను పురస్కరించు కొని నిరుపేద ముస్లిం మహిళలకు, యువతులకు ఆదివారం తెలంగాణ ముస్లిం ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ ముజాహిద్ హుస్సేన్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. హుజురాబాద్ పట్టణంలోని మామిండ్లవాడ లో వంద మంది నిరుపేదలకు దుస్తుల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద ముస్లింలను ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అజీం, భాషుమియా, అలీమ్, గౌస్ ఖాన్, మురాద్ హుస్సేన్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

## మామిడాలపల్లిలో ఘనంగా పోచమ్మ బోనాలు

**సూర్య, వీణవంక**



ఉగాది పర్వదినం సందర్భంగా వీణవంక మండలం మామిడాల పల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో ప్రజలు పోచమ్మ బోనాలు డప్పు చప్పుళ్లతో, శివసత్తుల నృత్యాలతో ఘనంగా బోనాలు సమర్పించారు. చల్లంగా దీవించి వర్షాలు, పాడిపంటలు సమృద్ధిగా పండేటట్లు దీవించాలని ప్రజలు మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు దరిపెల్లి సురేష్, మాజీ అధ్యక్షులు గుండేటి సుధాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తాళ్లపల్లి తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల కమిటీ కన్వీనర్ గా మర్రి వెంకటస్వామి ఎన్నిక

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



దేశవ్యాప్తంగా జరగనున్న పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికల కమిటీ కన్వీనర్ గా సీపీఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి ఎన్నికయ్యారు. కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుల, ప్రజాసంఘాల ఆఫీస్ బేరర్స్ సమావేశంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి సమక్షంలో ఎన్నికల కమిటీ కన్వీనర్ గా సీపీఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి ఎన్నికవగా కమిటీ సభ్యులుగా సిద్దిపేట,హనుమకొండ,రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల సీపీఐ కార్యద ర్శులు మంద పవన్,కర్రె భిక్షపతి, గుంటి వేణు,వెన్న సురేష్,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి,గడిపె మల్లేష్,ఆదరి శ్రీనివాస్, కసిరెడ్డి మణికంఠ రెడ్డి,భారత జాతీయ మహిళా సమాఖ్య ఐదు జిల్లాల అధ్యక్ష,కార్యదర్శులైన కిన్నెర మల్లవ్వ,గూడ పద్మ,మంచాల రమాదేవి,కె. వి.అనసూయ,కొక్కుల శాంతవ్వ ఎన్నికైనారు.

## కాంగ్రెస్ పార్టీ ఎన్నికల పరిశీలకులుగా సిరాజుద్దీన్ మన్సూర్

**సూర్య జగిత్యాల టౌన్**

కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల పరిశీలకులుగా జగిత్యాల జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షులు సిరాజుద్దీన్ మన్సూర్ నియామకమయ్యారు. ఈ మేరకు ఆదివారం ఏఐసీసీ తెలంగాణ మైనారిటీ విభాగం ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీ ఎన్నికల నేపథ్యంలో నిజామాబాద్ పార్లమెంటు పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో నియోజకవర్గాల వారీగా పరిశీలకులను నియమించారు. ఈ సందర్భంగా సిరాజుద్దీన్ మన్సూర్ మాట్లాడుతూ నిజామాబాద్ పార్లమెంట్ బరిలో ఉన్న తాటిపర్తి జీవన్ రెడ్డి గెలుపు కోసం అన్ని విధాలుగా మైనార్టీలను కలుపుకుని గెలుపు ధ్యేయంగా పనిచేస్తాన న్నారు. నాపై నమ్మకంతో పెద్ద బాధ్యత అప్పగించినందుకు ఏఐసిసి,టిపిసిసి అధిష్టానానికి, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నియామకానికి సహకరించిన ఏఐసీసీ మైనార్టీ విభాగ రాష్ట్ర అధ్యక్షులు, రాజ్యసభ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్ ఘరి, తెలంగాణ రాష్ట్ర మైనార్టీ విభాగం ఇంచార్జ్ ఫర్హాన్ అజ్మీ , కాంగ్రెస్ పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి లకు ధన్యవాదాలు తెలిపారు. కోరుట్ల నియోజకవర్గం ఇంచార్జి జువాడి నర్సింగారావు,మాజీ మంత్రి షబ్బీర్ అలీ, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, సునీల్ రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులను కలుపుకొని ఐక్యంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు.

# వస్త్ర పరిశ్రమ కార్మికులను ఆదుకుంటాం

**- రాజకీయాలు వద్దు.. కటకం మృత్యుంజయం**

**సూర్య సిరిసిల్ల టౌన్**

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ జేటిలమైన సమస్య కాదని ఈ సమస్యను కొంతమంది కావాలని జటిలం చేశారని టిపిసిసి సీనియర్ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం అన్నారు.ఆదివారం సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కటకం మృత్యుంజయ మాట్లాడుతూ యజమానులు పరిశ్రమలను ప్రారంభించాలని ఎన్నో సార్లు విన్నవించానని, కార్మికులకు పని కలిపించండని ప్రభుత్వం నుండి రావలసిన బకాయిలు ఖచ్చితంగా ఇప్పిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు.ఈ సమస్యను జటిలం చేసేందుకు కొంత మంది యజమానులు, అసాములతో పాటు కార్మికులను ఉసిగోలిపి సమ్మెకు దారి తీశారని అన్నారు.కేసీఆర్ మతి భ్రమించి మాట్లాడుతు న్నడాని ఏ ఒక్కనడైనా ధర్నాలో పాల్గొన్నవా అని ప్రశ్నించారు.అలాంటి నీవు ఇప్పుడు ధర్నాలు చేయడం సింగ్ అనిపిస్తలేదా కేసీఆర్ అని ప్రశ్నించారు.ఇక్కడి పరిశ్రమకు ఇవ్వవల్సిన దాదాపు 300 కోట్ల రూపాయలు ఎందుకు పెండింగ్ పెట్టవో కేటీఆర్ సమాధానం చెప్పాల న్నారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం మానుకో కేసీఆర్, లేకపోతే ప్రజల చేత ఛీ అనిపించుకోక తప్పదన్నారు.బతుకమ్మ చీరల కోసం కొంతమంది ఏజెంట్లను పెట్టి కోట్ల రూపాయలు దండుకున్నారని మృత్యుంజయం ఆరోపించారు. బతుకమ్మ చీరల స్కీం నిరుపేద



కార్మికుల కోసం కాదని కేసీఆర్ జేబులు నింపు కోవాడానికే అన్నారు.బతుకమ్మ చీరలలో అధికారుల నుండి మొదలుకొని కేటీఆర్ వరకు అవినీతికి పాల్పడ్డారాని దీనిపై త్వరలో విచారణ చేయిస్తా మని అన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షు లు చొప్పదండి ప్రకాష్,సంగీతం శ్రీనివాస్ ఆకు నూరి బాలరాజు,సూర్య దేవరాజు,వైద్య శివప్రసాద్, మ్యాన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడ రూరల్ మండలం వట్టెంలలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**సూర్య వేములవాడ టౌన్**





వేములవాడ రూరల్ మండలం వట్టెంలా చివరలో పేకాట స్థావరంపై పోలీసుల మెరుపు దాడి చేశారు టిఆర్ఎస్ నాయకుడు మంద శ్రీనివాస్ తో పాటు నలుగురిని అరెస్టు చేసి మరో ఐదుగురు పరారీ లో ఉన్నట్టు రూరల్ ఎస్ఐ మారుతి తెలిపారు. వీరి వద్దనుండి 15.420 రూపాయలు ఆరు మోటర్ సైకిల్లు 6 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు .వేములవాడ రూలర్ సిఐ శ్రీనివాస్ రూలర్ ఎస్సై మారుతి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నెంబర్ ప్లేట్స్ లేకుండా వాహనాలు నడిపితే సీజ్

**- డిఎస్పి నాగేంద్ర చారి**

**సూర్య వేములవాడ టౌన్**



వేములవాడ నియోజకవర్గంలో మరియు పట్టణంలో వివిధ కూడాళ్ల లో నంబర్ ప్లేట్స్ లేకుండా తిరుగుతున్న వాహనాలను సీజ్ చేస్తామని వాహనదారులకి రిజిస్ట్రేషన్ చేసుకోక పోవడం వల్ల జరిగే నష్టాలను వివరించారు. ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించు వాహనాలపై చర్యలు తీసుకోకూడదని కొంతమంది ట్రాఫిక్ పోలీస్ లను తప్పుదారి పట్టించడం కోసం దొంగ నంబర్ లను వాడుతున్నారని వారి పై గతంలో క్రిమినల్ కేసులు పెట్టడం జరిగిందని, ఇకనుండి ఎక్కడైనా సరైన నంబర్ ప్లేట్స్ లేని, రిజిస్ట్రేషన్ చేసుకొని వాహనదారులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కొంత మంది నంబర్ లేని వాహనాలను నడిపిన వాహనదారులను డీఎస్పీ నాగేంద్ర చారి హెచ్చరించారు. అదేవిధంగా వాహనదారులు పర్యావరణ కాలుష్యం కలగజేసే భారీగా శబ్దాలు వచ్చే సైలెన్సర్లను బిగించకూడదని తెలుపుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు.

## సిరిసిల్లలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

**సూర్య సిరిసిల్ల టౌన్**



సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో నిర్వహిస్తున్న రాజన్న సిరిసిల్ల ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా బిఆర్ఎస్ పార్టీ సిరిసిల్ల శాఖ అధ్యక్షులు జిందం చక్రపాణి, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, టోర్నమెం ట్లో పాల్గొంటున్న క్రీడాకారులు భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో ఆడి మంచి పేరు సాధించాలని అన్నారు.క్రీడాకారులు మన ప్రాంతానికి గర్వకారణంగా నిలవాలని, మిమ్మల్ని చూసి మేము గర్వపడే రోజు రావాలని అన్నారు.ప్రతి క్రీడలో గెలుపోటములు సహజమని క్రీడా నైపుణ్యంతో మనం ఆడే జట్టు గెలుపు కోసం పాటుపడడమే క్రీడాకారుడి ప్రధమ లక్ష్యమని అన్నారు.సిరిసిల్ల లో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తూ క్రికెట్ అభివృద్ధికి కృషి చేస్తున్నా నిర్వాహకులకు బిఆర్ఎస్ పార్టీ తరఫున హృదయపూర్వక అభినందనలు తెలియజేసుకుంటున్నామని అన్నారు.అనంతరం టాస్ వేసి కేటీఆర్ కప్ క్రికెట్ టోర్నమెంట్ ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్,కౌన్సిలర్ గెంట్యల శ్రీనివాస్, ఎండి సత్తర్,కార్యదర్శి మ్యాన రవి,గుండ్లపల్లి పూర్ణచందర్,అడ్డగట్ల మురళి తదితరులు పాల్గొన్నారు.

## మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

**- ఎంపీటీసీ ఉయ్యాల శ్రీనివాస్ గౌడ్**

**సూర్య బోయినపల్లి**



సర్వ మతాల సమ్మేళనం భారతదేశమని మతసామరస్యానికి ప్రతిక ఇఫ్తార్ విందని ఎంపీటీసీ ఉయ్యాల శ్రీనివాస్ అన్నారు. బోయినపల్లి మండలం తడగొండ గ్రామంలో ముస్లిం సోదరులకు ఆదివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసిన ఎంపీటీసీ ఉయ్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచంలోనే భారతదేశానికి ఒక విశిష్టత ఉందని అన్ని మతాల సమ్మేళనం సర్వమతాలను సమానంగా చూసేది ఒక భారతదేశంలోనే అని అన్నారు. రంజాన్ పండుగకు ప్రధాన కారణం ముస్లింల పవిత్ర గ్రంథం దివ్య ఖురాన్ ఈ నెలలోనే ఆవిర్భవించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైమద్ హుస్సేన్, మహమ్మద్ హుస్సేన్, మహమ్మద్ హకీమ్, మహమ్మద్ రహీం, రఫీ, బఖత్, హమీద్ తదితరులు ఉన్నారు.

## పోపా ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ ఎంట్రన్స్ ఉచిత శిక్షణ

**సూర్య సిరిసిల్ల టౌన్**

పద్మశాలి అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (పోపా) ఆధ్వర్యంలో ఉచిత పాలిటెక్నిక్ ఎంట్రన్స్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ప్రకటించారు.రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పద్మశాలి అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ ఎంట్రన్స్ కొరకు ఉచిత శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పోపా ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల పున్న చందర్ ఒక ప్రకటనలో తెలిపారు.నిపుణులైన పద్మశాలి అధ్యాపక బృందంచే 45 రోజుల పాటు శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు.పదవ తరగతి పరీక్షకు హాజరై లేదా ఉత్తీర్ణులై, పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్న పద్మశాలి విద్యార్థులు అర్హులని అన్నారు.కుసుమ రామయ్య ఉన్నత పాఠశాలలో ఈనెల 14న శిక్షణ తరగతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దూస రఘుపతి, గాజుల ప్రతాప్,మచ్చ ఆనందం, కనుకుంట్ల పున్న చందర్ ,మామిడాల భూపతి లు కోర్స్ డైరెక్టర్లుగా వ్యవహరిస్తున్నారని అన్నారు.ఈకార్యక్రమంలో వాసాల హరిప్రసాద్,బొల్లి భగవాన్, బూర భాస్కర్ ,బైరీ రవీందర్,గుండెల్లి రవీందర్,అదేపు వేణు,కొడం రాంప్రసాద్, కనుకుంట్ల మధు,గడ్డం సత్యంలు పాల్గొన్నారు.

## ఎసిరెడ్డి మల్లారెడ్డి-నర్సవ్వ స్మారక క్రికెట్ టోర్నమెంట్

**సూర్య తంగళ్ళపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా లోని గోపాల్ రావు పల్లె గ్రామంలో నిర్వహించిన ఎసిరెడ్డి మల్లారెడ్డి-నర్సవ్వ స్మారక క్రికెట్ టోర్నమెంట్ జిపిఎల్ సీజన్ వన్ నిర్వహించారు.ఈ పోటీలో ఫైనల్ మ్యాచ్ లో బండలింగంపల్లి పై,గోపాల్ రావు పల్లె టీమ్ ఘనవిజయం సాధించింది.రన్నర్ ఆఫ్ ద టీమ్ బండలింగంపల్లి,మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ గా సన్నీని ఎన్ను కోబడ్డారు.వీరికి మండల రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు,మాజీ సర్పంచ్ ఎసిరెడ్డి రాంరెడ్డి ట్రోఫీని బహుకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ సతీష్ యాదవ్, యాదవ సంఘం సొసైటీ అధ్యక్షులు మిరల శ్రీనివాస్ యాదవ్, క్రికెట్ సభ్యులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీ ఎన్నిక

**సూర్య కోనరావుపేట**



కోనరావుపేట మండలం మల్కాపేట గ్రామంలో ఎమ్మార్పీ ఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల భిక్షపతి ఆధ్వర్యంలో ఆదివారం నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు.అధ్యక్షుడుగా బొర్ర దేవదాస్,ఉపాధ్యక్షులుగా కర్రోళ్ల మోహన్,స్వామి,ప్రధానకార్యదర్శిగా ఎలగందుల శ్రవణ్, కోశాధికారి గా కన్నం శ్రీనివాస్, కార్యదర్శిగా శంకర్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ మాట్లాడుతూ... మాదిగల వర్గీకరణ సాధించేవరకు మంద కృష్ణ మాదిగ ఏ పిలుపు ఇచ్చిన ఉద్యమంలో ముందుటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అరవింద్ ,ప్రణీత్, శివ,లెనిన్,రాజేష్ దినేష్,దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

## కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా జలపతి రెడ్డి

**సూర్య మల్లాపూర్**



తెలంగాణ ప్రదేశ్ కిసాన్ కాంగ్రెస్ జగిత్యాల జిల్లా నూతన అధ్యక్షుడిగా మండల కేంద్రానికి మాజీ జడ్పిటీసి ఎలాల జలపతి రెడ్డిని నియామిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్ రెడ్డి, ఎమ్మెల్సి జీవన్ రెడ్డి, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగరావు లు ఆదివారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## నిధులు కేటాయించినందుకు సీఅండ్ఎండీ కి రుణపడి ఉంటాం

**- సింగరేణి గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కర్ణ**

**సూర్య సెంటినరీ కాలనీ**



సింగరేణి సంస్థలో డా.బాబాసాహెబ్ అంబేద్కర్ 133 వ జయంతి వేడుకలను నిర్వహించడానికి నిధులు కేటాయించినం దుకు సీఅండ్ఎండీ నేనావత్ బలరాం నాయక్ కి రుణపడి ఉంటామని సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం బానోత్ కర్ణ నాయక్ అన్నారు. సింగరేణి సంస్థలో ఉన్నటువంటి ప్రతి ఏరియాకు లక్ష రూపాయల చొప్పున బడ్జెట్ కేటాయించి, అన్ని వర్గాల నుంచి ప్రాతినిధ్యం ఉండేలా అందరూ పాల్గొనేలా ప్రణాళిక సిద్ధం చేసి సర్క్యూలర్ జారీ చేయుటకు అనుమతినిచ్చి, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులను సోమవారం కొత్తగూడెం కార్పొరేట్ ఆఫీస్ కి పిలిపించి ఈ జయంతి వేడుకలను విజయవంతంగా నిర్వహించడానికి విధివిధానాలు రూపకల్పన చేయాలని ఆహ్వాన పత్రాలను పంపించిన సిఅండ్ఎండి, డైరెక్టర్ లకు, జీఎం (పర్సనల్)కి ధన్యవాదాలు తెలిపారు.

# ఆయన చేయి పడితే.... నొప్పులు మాయం

## -విరిగిన చేతులకు, కాళ్లకు కట్లు - ఆకు పసరే ఆయన మందు

**సూర్య, హుజురాబాద్**

విరిగిన చెయ్యి కైనా.... కాలు కైనా.... ఏదైనా..... ఆయన ఆకు పసరు పెట్టి కట్టు కట్టాడంటే.... ఆయిల్ తో తీడాడంటే నొప్పులు మాయం.... బోర్నపల్లిలో అన్నం రాఘవరావు అంటే పేరు తెలియని వారు లేరు. ఆయన ఇంటి ముందు పేషంట్లతో ప్రతిరోజు జాతరే.... వివరాలలోకి వెళితే..... హుజురాబాద్ మున్సిపల్ పరిధిలోని బోర్నపల్లికి చెయ్యి విరిగిన, కాలు విరిగిన, బెనికిన అన్నం రాఘవరావుతో ఆకు పసరు, ఆయిల్ తో మసాజ్ చేయించుకొని కట్టు కట్టించుకోవడానికి ప్రతి రోజు పేషెంట్లు వస్తుంటారు. రాఘవరావు తండ్రి అన్నం మల్లారావు గత 50 సంవత్సరాలుగా బోర్నపల్లిలో



నొప్పులు నయం చేయించుకోవడానికి ఆకు పసరు, ఆయిల్ తో మర్దన చేసి, కట్టు కట్టేవాడు. ఆయన పెద్ద కుమారుడైన రాఘవరావు తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ తన ఇంటి వద్దకు వచ్చే ప్రజలకు నొప్పులను నయం చేస్తూ గ్రామ ప్రజలతో పాటు వివిధ ప్రాంతాల ప్రజల ప్రశంసలు పొందాడు. ఆయన చెయ్యి పడితే నొప్పి మాయం అవుతుంది అన్న మాదిరిగా పేరు తెచ్చుకున్నాడు. యాక్సిడెంట్ అయి ఎముకలు విరిగినవారు సైతం ఆయన వద్దకు రావడం పరిపాటి అయింది. ముఖ్యంగా కాళ్లు బెనికిన, నడుం, మెడ పట్టుకున్న ఆయన మసాజ్ చేస్తే నొప్పులు తగ్గిపోతాయని ప్రజల నమ్మకం. నమ్మకానికి తగ్గట్టుగా ఆయన వచ్చిన వారిని సంతృప్తి పరుస్తూ నొప్పి తగ్గే విధంగా మసాజ్ చేస్తూ పంపిస్తుంటాడు. ఉదయం నుండి సాయంత్రం వరకు ఆయన వద్దకు వచ్చే ప్రజలకు వైద్య సహాయం అందిస్తుంటాడు. నొప్పి తగ్గిన తర్వాత ఎక్స్ రే తీయించుకొని కన్ఫామ్ చేసుకోమని చెప్తుంటాడు. తమ వద్దకు వైద్య సహాయం కోసం వచ్చే ప్రజల వద్ద పెద్దగా డబ్బు తీసుకోకుండా, బీదవారికైతే అతి తక్కువగా డబ్బు తీసుకుంటాడు. డబ్బు ముఖ్యం కాదు వారి తృప్తి



ముఖ్యమని రాఘవరావు చెప్తుంటాడు. ఆయన హస్తవాసి బాగుండడంతో హుజురాబాద్, జమ్మికుంట, వీణవంక, సైదాపూర్, హుస్నాబాద్, హన్మకొండ, వరంగల్, కరీంనగర్ ల నుండి కూడా ప్రజలు వస్తు తమ నొప్పులను నయం చేయించుకుని వెళ్తారు.

### ప్రజలకు వైద్య సహాయం అందిస్తా...

**అన్నం రాఘవరావు....**



తండ్రి వారసత్వంగా తాను గ్రామీణ ప్రాంతాల్లోని తమ వద్దకు వచ్చే ప్రజలకు 50 ఏళ్లుగా వైద్య సహాయం అందిస్తున్నానని, ఆకు పసరు, ఆయిల్ తో మసాజ్ చేయడం ద్వారా వారి నొప్పి తగ్గిస్తూ వైద్య సహాయం అందిస్తానని రాఘవరావు తెలిపారు.

# ఓ బామ్మ 105 ఏళ్ళు.. నో షుగర్.! నో బీపి.!!

## - ఘనంగా బామ్మ బర్త్ డే వేడుకలు

**సూర్య కొడిమ్యాల**

ఓ...బామ్మ సెంచరీ కొట్టింది. అందుకే 105 వ బర్త్ డే వేడుకలను కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. పది పదులు దాటిన ఆ బామ్మ ఉత్సాహంగా కేక్ కట్ చేసింది. వివరాలలోకి వెళితే కరీంనగర్ జిల్లా గంగాధర మండలం చెర్లపల్లి(ఆర్) గ్రామానికి చెందిన కురువృద్ధురాలు అమిరిశెట్టి లచ్చమ్మ ఆదివారం రోజు తన కుటుంబ సభ్యుల మద్య కేక్ కట్ చేసి 105 వ పుట్టినరోజు వేడుకలు జరుపుకుంది. బామ్మకు ఒక కుమారుడు, ముగ్గురు కూతుళ్ళు కాగ మనువళ్ళు, మనుమరాళ్ళు తో కలిపి ఆ కుటుంబ సభ్యుల సంఖ్య నలబైపైనే దాటింది. అలాగే మునిమనుమళ్ళు, మనుమరాళ్ళు కూడా చూసింది లచ్చమ్మ. తను 1919 పుల్కం హన్మయ్య-నర్సవ్వ దంపతులకు మొదటి సంతానంగా జన్మించానని తనకు చిన్నప్పుడే అదే గ్రామానికి చెందిన అమిరిశెట్టి నర్సయ్యతో వివాహం జరిపించారని, తనకు ముగ్గురు చెల్లెళ్ళు, ఇద్దరు తమ్ముళ్ళు కాగ కొద్ది కాలం క్రితం భర్త, పెద్ద తమ్ముడు, పెద్ద చెల్లెలు కాలం చేశారని తెలిపారు. తనకు నూట అయిదు సంవత్సరాలు వచ్చిన బీపి, షుగర్ లేవని అలాగే కంటి చూపు, వినికిడి సమస్యలు కూడా లేవని చెప్పింది. ఆరోజుల్లో ఎలాంటి పురుగు మందులు వాడని బలమైన తిండి తిని రోజంతా వ్యవసాయం చెసుకుంటూ కష్టపడేవారిమని అందుకే ఈరోజుల్లో ఇంత ఉత్సాహంగా ఆరోగ్యంగా ఉన్నానని, ఇప్పటికి తన పని చేసుకుంటానంటూ, తన తోడబుట్టిన వారు కూడా ఎంతో ఆరోగ్యంగా ఉన్నారంది. గత ఇరవై సంవత్సరాలుగా పగటిపూటంతా తన ఇంటి ముందు ఉన్న వేప చెట్టు కింద కుర్చుంటానని, అదే తన ఆరోగ్య రహస్యమంటూ నవ్వుతూ తన జ్ఞాపకాలను సూర్య పత్రికతో పంచుకుంది.



# ప్రభుత్వ భూముల పరిరక్షణకు పాత్రికేయులు తోడ్పడాలి

## - మానకొండూర్ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ

**సూర్య తిమ్మాపూర్**



ప్రభుత్వ భూముల పరిరక్షణకు పాత్రికేయులు కూడా తమవంతు తోడ్పాటు నందించాలని మానకొండూర్ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారా యణ కోరారు. ఆదివారం ఎల్ఎండీ కాలనీలోని అరుంధతి ఫంక్షన్ హాల్లో నిర్వహించిన మానకొండూర్ నియోజవర్గంలోని ఆరు మండలాల మీడియా మిత్రుల ఆత్మీయ సమ్మేళంలో ఆయన మాట్లాడారు.గత బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ, ప్రైవేటు భూముల ఆక్రమణలు యథేచ్ఛగా కొనసాగా యని, మానకొండూర్ నియోజకవర్గంలోనూ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, ఆ పార్టీ నాయకులు పెద్దఎత్తున భూకబ్జాలకు పాల్పడ్డారని ఆరోపిం చారు. బీఆర్ఎస్ పాలనలో నిర్నిరోధంగా సాగించిన రసమయి భూకబ్జాలు, అక్రమాలను వెలికి తీయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రభుత్వ,ప్రైవేటు భూములను కబ్జా చేసే వారిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని ఆయన స్పష్టం చేశారు. నియోజకవర్గ ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే రాజకీ యాల్లోకి వచ్చానని,ఆస్తుల సంపాదించుకోవాలన్న తపన తనకెంత మాత్రం లేదన్నారు. తాను ఉద్దేశపూర్వకంగా తప్పిదాలకు పాల్పడబోనని, నా వల్ల ఏదేని తప్పిదం జరిగితే సవరించుకోవడానికి కూడా సంశయించ బోనన్నారు. నియోజవర్గంలోని పాత్రికేయులందరితో తనకు సత్సంబంధాలున్నా యని, వృత్తిప రంగా వారు ఎదుర్కొంటున్న ఒత్తిళ్లు, సమస్యల గురించి తనకు తెలుసునన్నారు. ఎన్నికల అనంతరం జర్నలిస్టుల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.2014 నుంచి ప్రధాని నరేందర్ మోడీ గ్రాఫ్ పడిపోతున్నదని, స్కామ్ లతో ఆయన పాలన అవినీతిమయ మైందని డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ విమర్శించారు.ఎలక్టోరల్ బాండ్ల వ్యవహారం అతి పెద్ద స్కామ్ గా అవతరించిందని, లిక్కర్ వంటి స్కామ్ లలో నిందితులుగా ఉన్న వ్యక్తులకు సంబంధించిన సంస్థలు, కంపె నీల నుంచి పెద్ద మొత్తంలో జరిగిన ఎన్నికల బాండ్ల కొనుగోళ్లకు చెందిన డబ్బు బీజేపీ ఖాతాలో జమ కావడమే ఇందుకు కారణమని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల వేళ దర్యాప్తు సంస్థలను ప్రతిపక్ష పార్టీలపై ఎగదోయడం, బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు.ఈ సమావేశంలో నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, వివిధ ప్రెస్ క్లబ్ ల అధ్యక్షులు, బాధ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా మల్లన్న జాతర

## - పాల్గొన్న ఎమ్మెల్యే,విప్ ఆది శ్రీనివాస్

**సూర్య - కథలాపూర్**



మండలంలోని ఊటుపల్లి లో ఆదివారం మల్లన్న జాతరోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు బారులు తీరి స్వామి వారిని దర్శించుకున్నారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. కాగా వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు .అంతకు ముందు గ్రామస్థులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. ఆనంతరం ప్రభుత్వ విప్ సరామి వారికి బోనాలు సమర్పించుకున్నారు. ఒగ్గు డోలు కళాకారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మోదీ, సంజయ్ గాలి వీస్తోంది

## - కరీంనగర్ లో బీజేపీకి గతం కంటే రెట్టింపు మెజారిటీ తథ్యం - పార్లమెంట్ ఎన్నికల రాష్ట్ర ఇంఛార్జీ అభయ్ పాటిల్

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు బండి సంజయ్ గాలి వీస్తోంద<br>ని బీజేపీ పార్లమెంట్ ఎన్నికల రాష్ట్ర ఇంఛార్జీ అభయ్ పాటిల్ అన్నారు. కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల్లో ఈసారి బండి సంజయ్ గతంలో పోలిస్తే రెట్టింపు మెజారిటీతో గెలవబోతున్నారని చెప్పారు. అదే విధంగా రాష్ట్రవ్యాప్తంగా బీజేపీకి 10 కంటే ఎక్కువ ఎంపీ సీట్లు రాబోతున్నాయని చెప్పారు. ఆదివారం కరీంనగర్ లోని శుభమంగళ కన్వెన్షన్ లో కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల మేనేజ్ మెంట్ కమిటీతో అంతర్గత సమావేశం నిర్వహించారు. అభయ్ పాటిల్ తోపాటు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జి.ప్రేమేందర్ రెడ్డి, దుగ్యాల ప్రదీప్ కుమార్, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, ప్రతాప రామక్రిష్ణ, జిల్లా ఇంఛార్జీ మీసాల చంద్రయ్య, పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా బీజేపీ గెలుపు కోసం నిర్వహించాల్సిన సభలు, సమావేశాలు, కార్యక్రమాలపై అభయ్ పాటిల్ దిశానిర్దేశం చేశారు. సోషల్ మీడియాను విస్త్రతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. మోదీ ప్రభుత్వం దేశం కోసం చేపట్టిన విప్లవాత్మక చర్యలతోపాటు ప్రజల అభ్యున్నతి కోసం



అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై మీడియాలో ప్రచారం చేయాలని కోరారు. అందులో భాగంగా సామాజిక వర్గాల వారీగా సమావేశం నిర్వహించాలని సూచించారు. అట్లాగే యువత, మహిళ, కార్మికులుసహా వివిధ వర్గాల వారీగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహంచాలని కోరారు. అనంతరం అభయ్ పాటిల్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో మోదీ, బండి సంజయ్ గాలి వీస్తోందని, వీటిని ఓట్ల రూపంలో రాబట్టాలంటే పోలింగ్ బూత్, శక్తి కేంద్రాల అధ్యక్షుల పాత్ర కీలకమన్నారు. ఇకపై ప్రతి కార్యకర్త పోలింగ్ తేదీ నాటికి ప్రతి ఓటర్ ను మూడు సార్లు కలిసి బీజేపీకి ఓట్లు వేసేలా ప్రచారం నిర్వహించాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని పార్లమెంట్ నియోజకవర్గాల్లో తిరుగుతున్నామని, అన్ని సర్వేలను పరిశీలిస్తున్నామని... ఏ సర్వే చూసినా 8 నుండి 12 సీట్లు రావడం ఖాయమనే చెబుతున్నాయని తెలిపారు. “40 ఏళ్లుగా బీజేపీలో కొనసాగుతున్నానని, నాకున్న అనుభవం మేరకు చెబుతున్నా. రాష్ట్రంలో బీజేపీకి 10 కంటే తక్కువ ఎంపీ సీట్లు వచ్చే అవ ాశమే లేదు. తక్కువొస్తే నన్ను అడగండి”అని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలెవరూ బీఆర్ఎస్ కు ఓటేసేందుకు సిద్దంగా లేరని చెప్పిన అభయ్ పాటిల్... గత ఎన్నికల్లో బీఆర్ఎస్ కు ఓటేసిన ప్రజలంతా ప్రత్యామ్నాయ పార్టీలవైపు ద్రుష్టి సారించారని చెప్పారు. రాష్ట్రంలో మోదీ, సంజయ్ గాలి వీస్తున్నందున ఆయా ఓట్లను బీజేపీకి పడే విధంగా చేయడంలో కార్యకర్తల పాత్రే కీలకమని చెప్పారు. కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల విషయానికొస్తే.... గత పార్లమెంట్ ఎన్ని కలతో పోలిస్తే ఈసారి బండి సంజయ్ రెట్టింపు మెజారిటీతో గెలవబోతున్నారని తెలిపారు. ఆర్థిక ప్రగతిలో దేశాన్ని నెంబర్ వన్ గా తీర్చిదిద్దుతూ ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందిస్తున్న నరేంద్రమోదీ వంటి మహానుభావుడు ఒకవైపు... తానే తెలివైన నాయకుడినని భ్రమించే నాయకుడు రాహుల్ గాంధీ ఒకవైపు ఉన్నారని... ఎవరెన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు మాత్రం మోదీవైపే ఉన్నారని చెప్పారు. పోలింగ్ బూత్ ల వారీగా పనితీరుపై అంచనా వేస్తున్నామని, ఈ విషయ ంలో కఠినంగా ఉంటామన్నారు. ఎవరేమ నుకు న్నా తాను పార్టీ కోసం పనిచేస్తానని, వారం రోజుల్లో మళ్లీ కరీంనగర్ కు వస్తానని తెలిపారు.

# భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సమితి చలివేంద్రం ప్రారంభం

**సూర్య జగిత్యాల ప్రతినిధి**

వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజల దహార్తిని తీర్చేందుకు తమ వంతు ప్రయత్నంగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సమితి జగిత్యాల కన్వీనర్ బట్టు రాజేందర్ తెలిపారు. ఆదివారం స్థానిక కొత్త బస్టాండ్ ఆవరణలో సత్య సాయి సేవ సమితి ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. చలివేంద్రాన్ని సత్యసాయి సంస్థ కన్వీనర్ బట్టు రాజేందర్ ప్రారంభించడం జరిగి ంది. తద నంతరం సేవాదళ్ సభ్యులచే ప్రయాణీ కులకు, స్టాఫ్ కి చల్లని మినరల్ వాటర్ అందించారు. సత్యసాయి సంస్థ ద్వారా సామాన్య ప్రజల దాహాన్ని తీర్చే ఇంతటి చక్కని సేవా కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందని ఈ కార్యక్రమ నిర్వాహకులైన సత్యసాయి సంస్థ సభ్యులను ఆర్టీసీ డిపో మేనేజర్ సునీత, స్టాఫ్ అందరూ అభినందనలు తెలియ చేయడం జరిగింది. సత్యసాయి సంస్థ కన్వీనర్ బట్టు రాజేందర్ మాట్లాడుతూ భక్తులందరి సహకారంతో ఈ రోజు నుండి రెండు నెలల పాటు ఈ వేసవి కాలానికి ప్రతిరోజు ఉచితంగా మినరల్ వాటర్ అందిం చడం జరుగుతుందని, ప్రయాణికులు, ఇతరులు మినరల్ వాటర్ బాటిల్ ఒక్కొక్కటి 20 రూపా





యలు పెట్టి బయట కొనుక్కొనే బదులు ఈ ఉచిత సేవను విని యోగిం చుకొని వారి దాహార్తి ని తీర్చు కోవాలని తెలిపారు. అలాగే ఈ వేసవిలో వివిధ దీనజన సేవలు నిర్వహిస్తామని, ముఖ్యంగా మండే ఎండలో చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనాన్ని కొనసాగి స్తున్న వారికి పెద్ద గొడుగులు , చిన్న గొడుగులు , చెప్పులు , తల టోపీలు , బట్టర్ మిల్క్ వంటి తదితర వాటి పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఇట్టి అన్ని సేవలకు సహకరిస్తున్న భక్తులందరికీ ధన్యవాదాలు తెలిపారు. సేవలో సత్యసాయి సంస్థ తరపున కన్వీనర్ బట్టు రాజేందర్, కొత్త ప్రతాప్ , రాచకొండ విద్యాధర్, కొత్త వేణుగోపాల్ ,తాటిపర్తి దశరథ రెడ్డి , ఠాకూర్ నారాయణ్ సింగ్ , వంగల లక్ష్మినారాయణ, మామిడాల చంద్రయ్య , బొడ్ల రామ్మోహన్, మహిళా సభ్యులు, RTC స్టాఫ్ పాల్గొన్నారు.

# ఆలయ పునర్నిర్మాణ పనులను ప్రారంభించిన మనాలి రాజ్ ఠాగూర్

## - ప్రజలు సుభిక్షంగా ఉండాలంటూ ప్రత్యేక పూజలు

**సూర్య-గోదావరిఖని:**

స్థానిక అడ్డగుంటపల్లిలోని పోచమ్మ ఆలయ పున:నిర్మాణం పనులను శిలాఫలకాన్ని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ మనాలి రాజ్ ఠాగూర్ నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్ తో కలిసి ప్రారంభించారు. అనంతరం గ్రామ దేవతల పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న మనాలి రాజ్ ఠాగూర్ అమ్మవారి బోనాల కార్యక్రమంలో పాల్గొని ప్రజలతో మమేకమై అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం గ్రామదేవతలైన పోచమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకొని రామగుండం నియోజకవర్గ ప్రజలంతా ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో, సుభిక్షంగా జీవించేలా ఆశీర్వదించాలని కోరుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ రామగుండం నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి



పనులకు ఎలాంటి ఆటంకాలు కలుగకుండా, ప్రజల కోరిక మేరకు అభివృద్ధికి చిరునామాగా రామగుండం నగరం అభివృద్ధి చెందాలని అమ్మవారిని కోరుకున్నట్లు మనాలి ఠాకూర్ చెప్పారు. ఇంకా ఈ కార్యక్రమంలో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కు చెందిన పలువురు కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ఆయా విభాగాల అధ్యక్షులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నల్ల నీళ్లతో దురద పెడుతుందంటూ గ్రామస్తుల ఆందోళన

**సైదాపూర్ / కరీంనగర్ ప్రతినిధి**

కలుషితమైన మంచినీటితో నానా ఇబ్బందులు పడుతున్నామని,నల్ల నీళ్లతో స్నానం చేస్తే దురద పెడుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం సోమారం గ్రామ పరిధిలోని గర్రెపల్లిలో ఉన్న మంచినీటి బావిలో త్రాగునీరు కలుషితమైందని,వెంటనే అట్టి బావిలో ఉన్న పుడుకతీతను పూర్తిగా తొలగించి తమకు త్రాగునీరు అందించాలని అధికారులను గ్రామస్తులు కోరుతున్నారు. 2014లో మాజీ జెడ్పిటిసి బిల్లా వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్మించిన మంచినీటి బావిలో సైడ్ బోర్లు వేసిన మరుసటి నుంచే వర్షాకాలం ప్రారంభం కావడం,ప్రస్తుతం నీళ్లు అడుగంటి పోవడంతో నీరు కలుషితమైందన్నారు. గర్రెపల్లెకు కనీసం మిషన్ భగీరథ వాటర్ కూడా రావడం లేదని దీంతో తాము త్రాగునీటికి నానా ఇబ్బందులు పడుతున్నామని మహిళలు పేర్కొన్నారు.వెంటనే మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి మంచినీళ్ల బావిలో ఉన్న పూడికను తీసేందుకు చర్యలు తీసుకోవాలని గర్రెపల్లి గ్రామస్తులు కోరారు.ఈ కార్యక్రమంలో ఎనమల్ల రమేష్,దొకిడి తిరుపతి, వేముల రమేష్ బాబు, సుంక సంపత్,శోభ,లక్ష్మి, నరసమ్మ,వెంకటస్వామి, తదితరులు ఉన్నారు.

# మాల సంఘం నూతన కమిటీ ఎన్నిక

**సూర్య ఎండపల్లి**

ఎండపల్లి మండల కేంద్రంలో మాల సంఘం కార్యవర్గన్ని ఆదివారం ఎన్నుకు న్నారు. అధ్యక్షులుగా గౌరి ప్రభాకర్ ఏకగ్రీవంగా ఎన్నిక కాగా ఉపాధ్యక్షులుగా దేవి నర్సయ్య (బాబు ), ప్రధాన కార్యదర్శి ఆల్క లచ్చయ్య, కార్యదర్శి అనే శ్రీనివాస్, కోశాధికారిగా అనే మల్లయ్య,కార్యవర్గ సభ్యులుగా దేవి చుక్కయ్య, దేవి భీమయ్య లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులు గౌరి ప్రభాకర్ మాట్లాడుతూ... మాల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక పట్ల కృషి చేసిన కుల బంధావులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మాల సంఘం అభివృద్ధికై తమ వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో దేవి భీమయ్య,కనకయ్య, మేసు భీమయ్య,అనే శంకరయ్య,దేవి చిన్నయ్య,దేవి ప్రవీణ్,దేవి విక్కీ,గౌరి చిరంజీవి,దేవి రవీందర్,మేసు ప్రదీప్,మనోజ్ కుమార్,దేవి మహేష్,దేవి చందు, దేవి వెంకటేష్, దేవి నగేష్,దగ్గుల చందు జూపాక నరేష్,పిట్ట స్వామి,దేవి పోచయ్య,దేవి అనిల్, ఆల్క ప్రశాంత్,దేవి చంద్రక్రాంత్ ఆల్క బాబు,ఆల్క పతి మహిళలు కుల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్నాం.. ఆదుకోండి

## - నా భర్తకు కిడ్నీ ఇచ్చి బ్రతికించుకుంటా

**సూర్య మల్లాపూర్**

భర్తలో సగభాగం భార్య.. కష్టం వచ్చిన కన్నీళ్ళు ఏరులై పారిన కడదాక కలిసి వుండే బందం భార్య భర్తలదే అంటే వింటుంటాం అలాంటి అన్యోన్య దాంపత్యం పై విధి కన్నెర్ర చేసింది. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని ముత్యంపేట్ గ్రామానికి చెందిన సామల్ల తిరుపతి లావణ్య లది నిరుపేద కుటుంబం. తిరుపతి ఓ స్కూల్ బస్సు నడిపిస్తూ జీవనం సాగించేవాడు గత నాలుగు సంవత్సరాలుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చికిత్స కోసం ఆసుపత్రిల్లో ఇప్పటికే 7లక్షలకు పైగా ఖర్చు చేసుకున్నారు. ఇటీవల ఆసుపత్రి కి చికిత్స కోసమై వెళితే పరిస్థితి విషమించింది కిడ్ని మార్పిడి తప్పనిసరిగా చేయాలని వైద్యులు సూచించారు. అయితే భర్తను బ్రతికించుకోవడానికి లావణ్య తన కిడ్నీ ని ఇవ్వడానికి సిద్ధమయ్యింది. కాని.. కిడ్ని మార్పిడికి భార్య భర్త లు ఇద్దరికి ఆపరేషన్ చేయాల్సి వుండటంతో నాలుగు లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలపడంతో లావణ్య దీనంగా విలపిస్తూ దాతల సాయం కోరుతుంది. పోన్ పే, గూగుల్ పే నం. 8309424664 ద్వారాఆర్థికంగా తమను ఆదుకోండని వేడుకుంటుంది.

# కాంగ్రెస్ పార్టీ ఓ బి సి జిల్లా ఉపాధ్యక్షుడిగా పర్షవేన మోహన్ నియామకం

**సూర్య మంథని**

కాంగ్రెస్ పార్టీ ఓ బి సి సెల్ పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షుడిగా పర్షవేన మోహన్ ను నియమించి తెలంగాణ ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా నియామక పత్రం అందజేశారు. ఆదివారం మంథని పట్టణం మంత్రి నివాసంలో తెలంగాణ ఐటి, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు పార్టీ నిర్మాణ క్రమంలో భాగంగా ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడిగా మోహన్ ను నియమించారు. ఈ సందర్భంగా నియామక పత్రం అందుకున్న మోహన్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు దిశగా కృషి చేయాలని మంత్రి శ్రీధర్ బాబు వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్దపెల్లి ఓ బి సి జిల్లా ప్రధాన కార్యదర్శి గోటికార్ కిషన్ జీ, మండల పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వేంటేశ్వర కాలనీలో ఘనంగా పోచమ్మ బోనాలు

**సూర్య తిమ్మాపూర్**

తిమ్మాపూర్ మండలం అలుగునూర్ పరిధిలోని శ్రీ వెంకటేశ్వర కాలనీలో ఆదివారం పోచమ్మ బోనాల వేడుక ఘనంగా జరిగింది. పోచమ్మ దేవాలయం ఏర్పాటు జరిగి దశాబ్ద కాలం పూర్తయిన సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజా, పోచమ్మపట్నం, గొర్రెపోతు గావు కార్యక్రమాన్ని చేపట్టారు. పోచమ్మ దేవతకు బోనాలు సమర్పించడానికి కాలనీ ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఇట్టి కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర కాలనీ, పోచమ్మ దేవాలయ కమిటీ అధ్యక్షులు చిందం నరసయ్య , సల్ల రాజయ్య, గడప శేఖర్, సిరిపురం శ్రీనివాస్, ఐతం వెంకన్న, సల్ల మల్లేశం, వరాల నర్సింగం, బండి మొగిలి, కుమార్, రాములు, సుధాకర్ రెడ్డి, చిందం ముత్యం, నూనె మధు, మల్లయ్య, చిందం అంజిలతో పాటు కాలనీ మహిళలు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గుమ్లాపూర్ రెడ్డి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

**సూర్య చొప్పదండి**

గుమ్లాపూర్ రెడ్డి సంఘం ఎన్నికలలో ఇద్దరు అభ్యర్థులు పోటీ చేయగా కోస్నా తిరుపతి రెడ్డి అధ్యక్షులుగా ఎన్నికయ్యారు.అలాగే ఉపాధ్యక్షులుగా ఇనుకొండ రమణారెడ్డి, వెల్మ శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వెలుమ రఘుపతి రెడ్డి, సహాయ కార్యదర్శిగా ఎడవల్లి రాజేందర్ రెడ్డి, కోశాధికారిగా రూపురెడ్డి హనుమంత రెడ్డి ఎన్నికయ్యారు. ఇందుకుగాను వారి వారి సమయాన్ని కేటాయించి వచ్చి ఓటు వేసినటువంటి రెడ్డి సంఘ సభ్యులందరికీ రెడ్డి సంఘం నూతన నూతన కార్యవర్గ సభ్యుల తరఫున కృతజ్ఞతలు తెలియ చేశారు.అలాగే గౌరవ అధ్యక్షులుగా ముస్కె వెంకట్ రెడ్డి, అప్పిడి శ్యామ్ సుందర్ రెడ్డి, వెల్మ బాపురెడ్డి, గుజ్జుల జగన్ రెడ్డి లు నియామకం అయ్యారు. కార్యవర్గ సభ్యులు గా అల్లపు శ్రీనివాస్ రెడ్డి, రూపురెడ్డి మనోహర్ రెడ్డి, ఇనుకొండ మనోజ్ రెడ్డి, అప్పిడి మధుసూదన్ రెడ్డి నియమించగా ఎన్నికల రిటెర్నింగ్ అధికారులు గా కుర్మచలం రత్నాకర్, సావనపెల్లి కృష్ణమాచర్యులు వ్యవహారించారు.

# ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

**సూర్య వీణవంక**

ఆదివారం జరిగిన మోడల్ స్కూల్ 6 వ తరగతి ప్రవేశ పరీక్షకు 225 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 199 మంది విద్యార్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన 7 నుండి 10 వ తరగతి ప్రవేశ పరీక్షకు 38 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 29 మంది విద్యార్థులు హాజరయ్యారని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ వేణు గోపాల రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష సజావుగా సాగిందని, త్వరలో ఫలితాలు వెల్లడిస్తారని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

# జ్యోతిష్మతీ కళాశాలపైనే చర్యలు తీసుకోవాలి

## - బిసి యువజన సంఘం అధ్యక్షులు కరీంనగర్ జిల్లా మాచర్ల అంజయ్య

**సూర్య తిమ్మాపూర్**

జ్యోతిష్మతీ ఇంజినీరింగ్ కళాశాలలో డిప్లొమా ఫస్టియర్ చదువుతున్న కాటారం మండలం దామెరకుంటకు చెందిన అభిలాష్ బావిలో పడి మృతి చెందిన విషయంలో మొదట కళాశాల యాజమాన్యంపైనే చర్యలు తీసుకోవాలని బీసీ సంఘాలు తరపున మేము డిమాండ్ చేస్తున్నామని బిసి యువజన సంఘం అధ్యక్షులు కరీంనగర్ జిల్లా మాచర్ల అంజయ్య అన్నారు. కళాశాలలో భద్రత ఉన్నట్లయితే... అభిలాష్ తోపాటు నలుగురు విద్యార్థులు కళాశాల హాస్టల్ నుండి బయటకు వెళ్లి మద్యం సేవించి మళ్లీ ఎలా వస్తారు. ఆ తరువాత రాత్రి అభిలాష్ బయటకు వెళ్లిన బావిలో పడి చనిపోయాడు... ఈ విషయాలను గమనిస్తే కళాశాల యాజమాన్యం భద్రతా లోపం స్పష్టంగా కనిపిస్తోంది. సీసీ కెమెరాలుంటే అభిలాష్ బయటకు ఎలా వెళ్లాడో చూపించాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. తన కళాశాలలోని భద్రతా లోపాన్ని, హాస్టల్ వార్డెన తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకే కళాశాల చైర్మన్ సాగర్ రావు ప్రైవేటు హాస్టళ్లపై ఫిర్యాదు చేస్తున్నాడన, తన తప్పిదంపై మొదట సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నాము. ప్రైవేటు హాస్టళ్ల విద్యార్థుల విషయంలో వారి తల్లిదండ్రులు స్పందిస్తారని, మొదట అభిలాష్ తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదుపై సాగర్ రావు స్పందించాలని కోరుతున్నామని అన్నారు.